

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త


# పెంచలకోనలో శృంగేరి పీఠాధిపతి





**రాపూరు నవంబర్ 16 ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి వారిని శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీశ్రీశ్రీ విదుశేఖర భారతీ మహాస్వామి దర్శించుకున్నారు. శనివారం విజయ యాత్రలో భాగంగా కోనకువచ్చిన స్వామి వారికి దేవాదాయశాఖ మంత్రి ఆనం రామానారాయణరెడ్డి ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణలు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ వేదపండితులు,అర్చకస్వాములు వేదమంత్రాలు మంగళవాయిద్యాలతో విదుశేఖరభారతీ మహాస్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.అనంతరం స్వామి వారు శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి ,ఆదిలక్ష్మీ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద ఆశీర్వచన మండపంలో విధుశేఖర మహాభారతీ స్వామి వారికి వేదపండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనాలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామి వారు భక్తులకు ఆశీస్సులు అందజేశారు.ఈకార్యక్రమంలో జిల్లా సెంట్రల్ బ్యాంకు మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ చెన్ను తిరిపాల్‌రెడ్డి,టిడిపినాయకులు చెన్ను అశోక్‌రెడ్డి,కాటంరెడ్డి రవీంద్రనాద్‌రెడ్డి,బొల్లినేని గిరిధర్‌నాయుడు,మల్లవడ్ల వెంకటరమణారెడ్డి, చెన్ను భాస్కర్‌రెడ్డి ,డాక్టర్ వంకివోలు వంశీదర్‌రెడ్డి,మోరం రెడ్డి మధుసూదనరెడ్డి,పలువురు దేవాదాయశాఖ అదికారులు పెద్దఎత్తున స్వామి భక్తులు పాల్గోన్నారు.

## కలెక్టర్‌ని కలిసిన ఎస్టి కమిషన్ సభ్యుడు శంకర్ నాయక్



**నెల్లూరు అర్బన్, నవంబర్ 16, ప్రబతావార్త** శనివారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ నగరంలోని కలెక్టర్ వారి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్‌ను, మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్టీ కమిషన్ వెంట ఎస్టి నాయకులు పెంచలయ్య,ఎస్సీ నాయకులు రఘు ఉన్నారు. జిల్లాలో శనివారం ఉదయం నుంచి పర్యటనలో భాగంగా పలు , ప్రదేశాలు, సందర్శించిన ఆయన అక్కడ ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పై కలెక్టర్‌తో చర్చించారు.

## నిరుపేదలు నివసించే ప్రాంతాలపై మరింత దృష్టి పెడతా

### ఎమ్మెల్యే కోట్టంరెడ్డి శ్రీధర్ రెడ్డి



**నెల్లూరు రూరల్, నవంబర్ 16, ప్రభాతవార్త** నియోజకవర్గ పరిధిలోని 26వ డివిజన్, డ్రైవర్స్ కాలనీ బిట్ 1, బిట్ 2 లలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శనివారం పరిశీలించారు. డ్రైవర్స్ కాలనీ బిట్ 1, డ్రైవర్స్ కాలనీ బిట్ 2 లలో అద్వాన్నపు రోడ్లకు, అద్వాన్నపు డ్రైన్లకు శాశ్వత పరిష్కారము చూపుతామన్నారు. వారం రోజుల్లో పేరుకుపోయిన జమ్మును తొలగిస్తామన్నారు. సంపూర్ణంగా రోడ్లు, డ్రైన్లను నిర్మిస్తాం. భవిష్యత్తులో ఇక్కడ మరిన్ని సమస్యలకు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ బూడిద సుప్రజ, క్లస్టర్ ఇంచార్జ్ ఊరందూరు సురేంద్రబాబు, టిడిపి నాయకులు బూడిద పురుషోత్తం యాదవ్, శివా చారి, మల్లెబోయిన వెంకటేశ్వర్లు యాదవ్, జహీర్, నరసింహ ముదిరాజ్, కృష్ణారెడ్డి, గౌస్ బాషా, జావిద్, ఖాలేషా, కృష్ణారెడ్డి, మాధవి, అమరేందర్ రెడ్డి, ప్రసాద్, ఏజాస్, జుబేర్, నస్రు, రఫీ, మునాఫ్, ఇలియాజ్, శీనయ్య, రఫీ, సుల్తాన్, శీనయ్య, చంద్ర, సుబ్బరాజు, శంకర్, బాబు, చాంద్ బాషా, ఖాలేషా, సరిత, హరి తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య గురుకులంలో వసతులు కొరత

### ఎస్టీ కమిషనర్ శంకర్ నాయక్





**కొడవలూరు(విడవలూరు), నవంబర్ 16, ప్రభాతవార్త** ఏకలవ్య బాలికల గురుకుల పాఠశాలలో ఫ్యాన్లు, లైట్లు, మౌలిక సదుపాయాలు కొరతగా ఉన్నాయని రాష్ట్ర ఎస్టీ కమిషనర్ శంకర్ నాయక్ వెల్లడించారు. కమిషనర్ ఏకలవ్య గురుకుల పాఠశాలకు రావడంతో విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బాలికల గురుకుల పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ గురుకులంలో విద్యార్థులకు కావలసిన మౌలిక సదుపాయాలు కొరతగా ఉన్నాయి. వాటిని సరిచేయాలని ప్రిన్సిపాల్‌కు అ దేశించారు. అంతేకాకుండా గిరిజనులు పడుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నామన్నారు. విద్యార్థుల పుస్తకాలు అధ్యాపకుల బోధన, గదులు, భోజనం తీరు ఆరా తీశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గురుకులంలో చదువుతున్న విద్యార్థుల చదువుల కోసం కోట్లు ఖర్చు పెడుతుంది. ప్రతి విద్యార్థి మంచి చదువులు చదివి ఉన్నత స్థాయికి ఎదిగి మంచి భవిష్యత్ పొందాలని తెలిపారు. అదేవిధంగా విద్యార్థుల తల్లిదండ్రులు కూడా బిడ్డల చదువుల పట్ల శ్రద్ధ తీసుకోవలసిన బాధ్యత ఉంది. అంతకు ముందు తాసిల్దార్ స్ఫూర్తి రెడ్డి పుష్పగుచ్చం అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కే సి పెంచలయ్య, ఎంపీడీవో సుబ్బారావు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన



**సైదాపురం, నవంబర్ 16, ప్రభాతవార్త** సైదాపురం మండలంలో నీటి వినియోగ దారుల సంఘం ఎన్నికలకు సంబంధించి 12చెరువులకు ఆయకట్టు నీటిపారుదల రైతులకు త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి తహశీల్దార్ ఈ.రమాదేవి ఆధ్వర్యంలో ఎన్నికల నిర్వహణ పోలింగ్ అధికారులకు ఇరిగేషన్ డీఈ హేమ శనివారం స్థానిక ప్రజాపరిషత్ కార్యాలయం సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్ ఎఈ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయగిరిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు



**ఉదయగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త** ఉదయగిరి గండిపాలెం మార్గం వైపు ఉన్న పాలకేంద్రం సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తన సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారని మొత్తం 8 మంది మీద కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.4వేలు నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

## రామ్మూర్తి నాయుడు మరణం బాధాకరం

### వేమిరెడ్డి దంపతులు

**కోవూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మరణం బాధాకరమని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామ్మూర్తి మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యేగా అమూల్యమైన సేవలు అందించారని అన్నారు. రామ్మూర్తి నాయుడు అకాల మరణం, వారి కుటుంబానికి తీరని లోటని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. రామ్మూర్తి నాయుడుకి శ్రద్ధాంజలి ఘటిస్తూ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## సోమశిల నీటిమట్టం



**అనంతసాగరం, నవంబర్16, ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శనివారం7,079క్యూసెక్కుల వంతున వరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయంలో69.789టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 400, ఎన్ఎఫ్‌సికి 550, పెన్నా డెల్టాకు 50, కండలేరు వరద కాలువకు3000 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 99.456 మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

# శ్రీకామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయానికి శంఖుస్థాపన



**అనంతసాగరం, నవంబర్16, ప్రభాతవార్త :** మండలంలోని సోమశిలలోని సోమేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీ శృంగేరి జగద్గురువులు శ్రీశ్రీశ్రీ విధు శేఖర భారతి మహాస్వామి దేవాదాయ - ధర్మాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి శ్రీ కామాక్షి సమేత సోమేశ్వర ఆలయం పునర్నిర్మాణం కు భూమి పూజ, శంఖుస్థాపన చేశారు. తొలుత శ్రీవిధుశేఖర భారతి మహాస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీశ్రీశ్రీ భారతీమహాస్వామి మాట్లాడుతూ 2021-22 తుఫాన్ ప్రభావంతో ఆలయం పూర్తిగా ధ్వంసమైందని , ఆలయ పునర్నిర్మాణానికి దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సంకల్పంతో పూర్వవైభవం వస్తుందన్నారు. అనంతరం 101111రూపాయల విరాళాన్ని మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి అందజేశారు. దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ గతంలో వరదలతో సోమేశ్వర ఆలయం పూర్తిగా ధ్వంసమైందని అయితే గత ప్రభుత్వంలో ఆలయాన్ని పట్టించుకునేవారు లేకపోవడంతో టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆలయం తీసుకొని రావాలని సంకల్పించానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎన్‌డిసిపి చైర్మెన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి, టిడిపి మండల అధ్యక్షురాలు మునగపాటి సునీత సుబ్బరాజు, మండల నాయకులు పాల్గొన్నారు.



# అర్ధరాత్రి అమ్మకాలు... ఆకతాయిల ఆగడాలు.. గాంధీనగర్ రోడ్డులో ఇదీ పరిస్థితి



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 16 ప్రభాతవార్త :** ఓవైపు మద్యం దుకాణం.. మరోవైపు అర్ధరాత్రి వరకు అమ్మకాలు జరిపే బిర్యానీ హోటళ్లతో వేదాయపాలెం సమీపంలోని గాంధీ నగర్ రోడ్డు ఆకతాయిల ఆగడాలకు నిలయంగా మారిపోయింది. వేదయపా లెం నుండి పొదలకూరు రోడ్డు వైపు వెళ్లేందుకు ఈ గాంధీ నగర్ రోడ్డు ప్రధాన మార్గంగా ఉంది. ఈ మార్గంలో నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డి విగ్రహ కూడలికి సమీపంలో ఇటీవల ఒక ప్రైవేట్ మద్యం దుకాణం ఏర్పాటు అయింది. గతంలోనూ అదే స్థానంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉండేది. అప్పటినుంచి ఇక్కడ మద్యం దుకాణం ఏర్పాటుపై గాంధీ నగర్ వాసులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పటి ప్రభుత్వం వినిపించుకోవడం లేదని ఇక్కడి ప్రాంతవాసులు వాపోతున్నారు. దీనికితోడు ఇక్కడ సమీపంలో ఉన్న బిర్యానీ హోటళ్లలో తినేందుకు వచ్చే వారితో ఈ ప్రాంతమంతా తీవ్ర రద్దీతో ఉం టుంది. రోడ్డుపైనే వాహనాలు నిలిపి హోటళ్లకు వెళ్తున్న వారి వల్ల ఇక్కడ ట్రాఫిక్‌కు అంతరాయం కూడా ఏర్పడుతూ ఉంటుంది. ఇటువంటిచోట అర్ధరాత్రి కూడా హోటళ్లలో అమ్మకాలు సాగుతుండడంతో ఈ ప్రాంతంలో ఆకతాయిల ఆగడాలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఎందుకనో స్థానిక పోలీసులు ఈ ప్రాంతం వైపు గస్తీ కూడా పెద్దగా పెట్టరని స్థానికులే ఆరోపిస్తున్నారు. అర్ధరాత్రి ఇక్కడి ఓ ప్రముఖ బిర్యానీ హోటల్లో అమ్మకాలు జరుగుతుండడం సర్వసాధారణం. అర్ధరాత్రి రెండు గంటల వరకు కూడా ఇక్కడ బిర్యానీ అమ్మకాలు జరుగుతుండడం విశేషం. దీంతో ఇక్కడ బిర్యాని దొరుకుతుందని నగరంలో అందరికీ తెలిసిన విషయం కావడంతో నగరంలోని ఇతర ప్రాంతాల వారు కూడా అర్ధరాత్రి ఇక్కడికి వస్తుంటారు. ఈ సమయంలో ఇక్కడ పలు సందర్భాల్లో ఘర్షణలు కూడా జరిగి ఉన్నాయి. కొద్ది నెలల కిందట ఇక్కడ ఏర్పడిన రద్దీ కారణంగా రెండు వాహనాల యజమానులకు మధ్య ఘర్షణ ఏర్పడి ఒకరిపై ఒకరు దాడి చేసుకుని తీవ్ర గాయాల పాలైన సంఘటన కూడా చోటుచేసుకుంది. అయినప్పటికీ ఇక్కడి పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. వేదాయపాలెం పరిధిలోని అన్ని రెస్టారెంట్లను 11 గంటలకల్లా మూయించి వేసే పోలీసులు ఈ బిర్యానీ హోటల్ పై ఎందుకంత ప్రత్యేక శ్రద్ధతో నిరాటంకంగా అమ్మకాలకు అనుమతి ఇస్తున్నారో అర్థం కావడం లేదు. రాత్రి పొద్దుపోయి ఉద్యోగాల నుండి వ్యాపారాలు ముగించుకుని ఈ దారి వెంబడి వెళ్లేవారు. ఈ ప్రాంతం దాటే వరకు భయపడే పరిస్థితి నెలకొంది. మద్యం దుకాణం ఎదుట గోడలపై, పక్కనున్న కూల్ డ్రింక్ దుకాణాల్లోనూ మద్యం తాగుతూ కొందరు యువత అల్లర్లకు దిగుతున్నారు. ఇకనైనా పోలీస్ శాఖ ఈ ప్రాంతంలో జరుగుతున్న అర్ధరాత్రి అమ్మకాలపై దృష్టి పెట్టి శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

## గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలి : శంకర్ నాయక్



**నెల్లూరు అర్బన్, నవంబర్ 16, ప్రభాతవార్త** గిరిజనుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నాయని, వాటిని అందిపుచ్చు కొని గిరిజనులు ఉన్నత స్థితికి ఎదగాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఆకాంక్షించారు. శనివారం నెల్లూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ప్రత్యేక పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా యానాది కుటుంబాలు ఉన్నాయని, వారికి ఇప్పటికీ ఆధార్, రేషన్, ఓటర్ ఐడి కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు లేవని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న అనేకమైన సంక్షేమ పథకాలకు మూలాధారమైనటువంటి ఇటువంటి కార్డులు లేకపోవడంతో అర్హతలు ఉండి కూడా వారికి సంక్షేమం అందడం లేదన్నారు. గిరిజనుల కోసం ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఆధార్ కార్డులు అందించుటకు జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా జిల్లాలోని 40 శాతం మంది గిరిజనులకు నరేగా జాబ్ కార్డులు లేవని తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అదేవిధంగా ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల నమోదు, విచారణలో జాప్యం తగదని, ఆయా కేసుల్లో భాదితులకు నష్టపరిహారం సైతం సత్వరమే అందించాలన్నారు. అలాగే ఇటువంటి కేసుల విషయంలో కోర్టులకు హాజరయ్యే భాదితులకు నిబంధనల మేరకు రవాణా ఖర్చులు సైతం చెల్లించాలన్నారు. అదేవిధంగా వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఎస్సీ ఎస్టీ బ్యాక్లాగ్ వేకెన్సీలను సత్వరమే భర్తీ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి పరిమళ, ఎస్టి నాయకులు పెంచలయ్య, ఎస్సీ నాయకులు రఘు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత మీడియా పై అవగాహన పెంచుకోవాలి: డిడి సదారావు



**నెల్లూరు విద్య, నవంబర్ 16 ప్రభాతవార్త** సమాజంలో చైతన్యం కలిగించి ప్రజల సమస్యలు పరిష్కరించేది పత్రికలు, విలేకరులని నెల్లూరు సమాచార శాఖ డిడి సదారావు అన్నారు. జాతీయ పత్రిక దినోత్సవ సందర్భంగా శనివారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో నెల్లూరు కొండాయపాలెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్లు పంపిణీ చేయడంతో పాటు మొక్కలు నాటే కార్యక్ర మంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరక్టర్ సదారవు మా ట్లాడుతూ మీడియా రంగంలో పలు మార్పులు వచ్చాయని పత్రికలతో పాటు ప్రస్తుతం టీవీ ఛానల్స్ కూడా ప్రజలకు అందుబాటులో ఉన్నా యన్నారు. మీడియా లేని సమాజాన్ని ఊహించుకోలేమని విద్యార్థులు, యువత మీడియాపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు యువతకు క్రీడాకారులకు సినిమాలకు సంబంధించిన అన్ని రకాల సమాచారం తెలియజేసేదే మీడియా అని ఆయన పేర్కొన్నారు. చిన్నతనం నుంచే విద్యార్థులు పత్రికలు చదివితే వారికి విజ్ఞానంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి అన్నారు. సివిల్ సర్వీస్ కి వెళ్లే విద్యార్థులు పత్రికలను సంపూర్ణంగా చదివి విజ్ఞానాన్ని పెంచుకొన్న వారే ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆయన అన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ జయప్రకాష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు టి రమేష్ బాబు, ప్రధాన కార్యదర్శి గడ్డం హనొక్, ప్రధానోపాధ్యాయులు యం భాస్కర్ రావు, ఉపాధ్యాయులు హరీష్, సోమేశ్వర రావు, కిరణ్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# సలసల కాగుతున్న నూనె ధరలు.. కొండెక్కిన నిత్యావసర వస్తువులు





**కోవూరు, నవంబం16ప్రభాతవార్త :** ఒక వైపు కూరగాయల ధరలు, మరోవైపు వంట నూనెల ధరలు.. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతుండడంతో సామాన్య మానవుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొందాం అంటే కొరివి.. అమ్ముదామంటే అడవిలా వీరి పరిస్థితి మారింది. పచ్చడి మెతుకులు చేసుకుందామన్నా మిరపకాయలు, ఉల్లిపాయల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల కాలం వరకు కిలో 90 రూపాయలకు లభిస్తున్న పామాయిల్ ప్రస్తుతం దిగుబడి సుంకం పెంచిన కారణంగా ఒక్కసారిగా 135 రూపాయలకు చేరుకుంది. ఏ కూర చేసుకుందామన్నా నూనె లేనిదే చేయలేని పరిస్థితి సామాన్యులలో నెలకొంది. వంట నూనెల ధరలు సలసల కాగిపోవడంతో సామాన్య మానవుని పరిస్థితి గంధరగోళంగా మారింది. ప్రస్తుతం త్వరలో డిసెంబర్ నెలలో క్రిస్మస్, జనవరి నెలలో సంక్రాంతి పర్వదినాలు రానున్నాయి. ఈ రెండు పండుగల్లో పిండి వంటలకు ప్రతి ఒక్కరూ అత్యంత ప్రధాన్యతను ఇస్తారు. ప్రస్తుతం నూనె ధరలతో పాటు నిత్యావసర వస్తువులు కూడా పెరిగిపోవ డంతో రానున్న ఈ పండుగలు ఏ విధంగా చేసుకోవాలని సామాన్యుడికి సంకటహరంగా మారింది. కనీసంకేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇష్టారాజ్యంగా పెరిగిపోతున్న నూనెలు, నిత్యావసరాలపై ఎటువం టి తనిఖీలు లేకుండా దృష్టి పెట్టిన దాఖలాలు లేవు,. దీంతో వ్యాపారస్తులు నల్లబజార్‌కు తరలించి తమ ఇష్టానుసారంగా రేట్లు పెంచి పబ్బం గడుపుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం సెప్టెంబర్ నెల నుంచి 5.5 శాతం ఉన్న దిగుమతి సుంకాన్ని ఒక్కసారిగా 27.5 శాతానికి పెంచడంతో అప్పటివరకు సామాన్యుడికి అందుబాటులో ఉన్న నూనె ధరలు ఒక్కసారిగా నింగికి ఎగిశాయి. గతంలో 130 లీటర్ ధర ఉన్న వేరుశెనగ నూనె ప్రస్తుతం 162 కు చేరుకుంది. అదేవిధంగా పూజకు వాడే నూనె సైతం 108 నుంచి 140కు చేరుకుంది. 120 ఉన్న ఫ్రీడ మ్ ఆయిల్ ధర ఒక్కసారిగా 160కు చేరుకోవడంతో రానున్న రెండు పండుగలు ఏ విధంగా చేసుకోవాలో అని మధ్యతరగతి కుటుంబాలు అల్లాడిపోతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం పెరుగుతున్న నిత్యావసరా లు, నూనె ధరలపై కళ్లెం వేయాల్సి న అవసరం ఎంతైనా ఉంది.

# టిట్కో ఇళ్లను వరదనీటి ముంపునుంచి కాపాడాలి

### ఇళ్లకు డిపాజిట్స్ కట్టినవారికి న్యాయంచేయాలి
### అసెంబ్లీలో వాణిని వినిపించిన కావలి ఎమ్మెల్యే దగుమాటి



**కావలి, నవంబర్ 16 ప్రభాతవార్త** కావలి మున్సిపాలిటి పరిధిలోని మద్దూరుపాడులో నిర్మించిన టిట్కోఇళ్లను వరదనీటి ముంపునుంచి కాపాడాలని, టిట్కోఇళ్లకు డిపాజిట్లు కట్టినవారికి న్యాయం చేయాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి శనివారం అసెంబ్లిలో తనవాణిని వినిపించి కావలి బావుటాను ఎగురవేశారు. అసెంబ్లిలో కావలి సమస్యలపై గళమెత్తారు. ఎపి టిట్కోద్వారా మద్దూరుపాడులో 2012లో ఇళ్లు నిర్మాణం జరిగాయన్నారు. మొత్తం 1309 ఇళ్లకు రిజిస్ట్రేషన్లు జరగ్గా ప్రస్తుతం 324 మంది మాత్రమే గృహాల్లో నివసిస్తున్నారన్నారు. టిట్కోఇళ్లకు తూర్పువైపున ఇరిగేషన్‌ట్యాంక్ ఉందన్నారు. దాని ఎఫ్టిఐ లెవల్లోనే టిట్కోఇళ్ల బేస్‌మెంట్లు కూడా వేయడం జరిగిందన్నారు. ఎప్పుడైతే ట్యాంకులోకి నీరు చేరుతుందో ఆ సమయంలో టిట్కోఇళ్లల్లోకి నీరుచేరి ముంపుకు గురిచేస్తున్నాయన్నారు. పడమటవైపున ఉన్న మూడు ఎకరాల్లోని వరదనీరుకూడా టిట్కో ఇళ్లల్లోకి చేరి మొత్తం గ్రౌండ్‌ఫ్లోర్‌ను ముంచేస్తుందన్నారు. గ్రౌండ్‌ఫ్లోర్ ఇళ్లల్లోని టాయిలెట్స్‌లోకి నీరుచేరి గృహస్తులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. టిట్కోఇళ్లు వరదముంపుకు గురికాకుండా చుట్టూ కాంపౌండ్‌వాల్ నిర్మించాలని, సక్రమమైన డ్రైనేజి వ్యవస్థను ఏర్పాటుచేయాలని ఎమ్మెల్యే దగుమాటి కోరారు. కావలి ప్రాంతప్రజలనుండి టిట్కోఇళ్లకోసం డిపాజిట్స్ సేకరించి వారికి ఇళ్లు ఇవ్వలేదన్నారు. వారికి న్యాయంచేయాలన్నారు. ఎపి టిట్కో ఇళ్లకోసం ప్రభుత్వం 113 ఎకరాల భూమిని నుడాకు అప్పగించి లేఅవుట్లువేసి 39కోట్లరూపాలయకు అమ్ముకోవడం జరిగిందన్నారు.

**-మైనర్ ఇరిగేషన్‌కి ఓ అండ్ యమ్ నిధులు మంజూరు చేయాలి :** మేజర్ ఇరిగేషన్‌కు ఇచ్చినట్లు మైనర్ ఇరిగేషన్‌కు కూడా ఓ అండ్ యమ్ నిధులు వెంటనే మంజూరు చేయాలని అసెంబ్లిలో కావలి ఎమ్మెల్యే దగుమాటి కోరారు. ఈ నిధులతో కాలువల పనులు జరిగేలా చూడాలన్నారు. రైతన్నలు ఉండే కావలి నియోజకవర్గంలో మేజర్, మైనర్ ఇరిగేషన్ ఉండే ప్రాంతమన్నారు. మేజర్ ఇరిగేషన్‌కు ఓ అండ్ యమ్ నిధులు ఇచ్చారన్నారు. మైనర్ ఇరిగేషన్‌కు కూడా ఈ నిధులు ఇవ్వలేదన్నారు. చెరువులనిండా నీరు ఉన్నా కాలువలు అభివృద్ధి చేయని కారణంగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే నిధులు మంజూరుచేసి కావలి నియోజకవర్గంలోని రైతన్నలను ఆదుకోవాలన్నారు.

**విధ్యుత్ తీగలవల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి :** ప్రతి పది సంవత్సరాలకోసారి మార్చవలసిన విద్యుత్‌తీగలను సముద్రతీరప్రాంతాల్లో మార్చకపోవడంతో విద్యుత్ షార్టేజ్‌తో తరచుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఎమ్మెల్యే దగుమాటి తెలిపారు. వెంటనే తీగలను మార్చాలన్నారు. కావలి నియోజకవర్గంలో 72 కిలోమీటర్ల పొడవున సముద్రతీరప్రాంతముందన్నారు. సముద్రతీరప్రాంతంలో నలభైవేలమంది నివసిస్తున్నారన్నారు. ప్రతి పది సంవత్సరాలకోసారి తీరప్రాంతంలో మార్చవలసిన విద్యుత్ తీగలను ఇరువై సంవత్సరాలుగా మార్చలేదన్నారు. స్థానిక వాతావరణం కారణంగా తీగలు తుప్పుపట్టి రాత్రివేళల్లో షార్టేజ్ జరుగుతూ ఇళ్లమీదపడుతూ ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. తీగలను మార్చి తీరప్రాంతాల్లో విద్యుత్ ఇబ్బందులు లేకుండా ప్రజలనుకాపాడాలని ఎమ్మెల్యేదగుమాటి తెలిపారు.

## స్వాములకు అన్నప్రసాద వితరణ చేసిన కంచి పరమేశ్వరరెడ్డి



**సంగం నవంబర్ 16 ప్రభాతవార్త** సంగంలో అయ్యప్ప స్వామి ఆలయాన్ని ఆత్మకూరుకి చెందిన నిత్య అన్నదాతకంచి పరమేశ్వరరెడ్డి దర్శించుకున్నారు. సంగమేశ్వరుని దర్శించుకున్న పరమేశ్వరరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వాములకు తన ట్రస్టు ఆద్వర్యంలో అన్న ప్రసాత వితరణ చేశారు. ఈ సందర్బంగా పరమేశ్వరరెడ్డి మాట్లాడుతు సంగంలో అయ్యప్ప స్వామి ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు.మాగంగిరి స్వామి మాట్లాడుతు నిత్య అన్నదాత కంచి పరమేశ్వరరెడ్డి పేదలకు చేస్తున్న అన్నదానం ఎంతో గొప్ప విషయమని అన్నారు. సంగంలో అయ్యప్పగుడికి షేడ్ ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పడం అభినందనీయమని అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎఎంసి చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి,మాగం గిరిబాబు, కర్నాటి చరణ్‌రెడ్డి తదితరులున్నారు.

## నీట మునిగిని పంట పొలాలు పరిశీలించిన వ్యవసాయాధికారి



**సీతారామపురం నవంబర్ 16 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని గంగవరం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు నేల ఒరిగిన వరి పంటను మండల వ్యవసాయాధికారి పి. చెన్నారెడ్డి పరిశీలించారు. పొలంలో ఎక్కువ నీరు నిలిచి ఉన్నట్లు అయితే వెంటనే తీయాలని తెలిపారు. గింజ మొలకరాకుండా లీటర్ నీటికి 2 గ్రాములు ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు.ప్రాథమిక నష్టం అంచనాలను పై అధికారులకు తెలియజేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వి.ఎ లక్ష్మీనారాయణ రైతులు పాల్గొన్నారు.

## సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమం



**సంగం నవంబర్ 16 ప్రభాతవార్త** సంగం ఎంపిడిఒ కార్యాలయంలో తహసిల్దారు సోమ్లానాయక్ సాగునీటి సంఘం ఎన్నికల నిర్వహణపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. పిఒ,ఎపిఒలపైలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దారు మాట్లాడుతు మండలంలో నాలుగు మైనర్ సాగునీటి సంఘాలు,రెండు మేజర్ సాగునీటి సంఘాలు ఉన్నాయని ఆయన తెలిపారు. వీటికి ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఎన్నికలు పకడ్బందిగా నిర్వహించాలని ఆయన సూచించారు. మేజర్ సాగునీటి సంఘాలు అన్నారెడ్డిపాళెం, పడమటిపాళెం నీటి సంఘాలు ఉన్నాయని తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలకు సంబందించి ఓటర్ల జాబితా కూడా ప్రచరించడం జరిగిందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఏఇ వినయ్‌కుమార్, అనంతసాగరం ఇరిగేషన్ ఏఇ లీలాకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కావలి ఎంపిడిఒ కార్యాలయంలో జిపిడిపి శిక్షణ తరగతులు



**కావలిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త** కావలి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంనందు కావలి మం డలపరిధిలోని పంచా యితి సర్పంచ్‌లకు, పంచాయితి కార్యదర్శులకు, డిజిటల్ అసి స్టెంట్‌లకు, మండల స్థాయి అధికారులకు రెండవరోజు శనివారం జిపిడిపి శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగింది. ఈ శిక్షణ తరగతులలో పంచాయితీల అభివృద్ధి, మౌళిక వసతులు, పారిశుధ్యం, త్రాగునీరు, తదితర అంశాలపై చర్చించడం జరిగింది.

## మంచి చదువులు చదివి విజయాలు సాధించాలి లైబ్రేరియన్ నిరూప



**విడవలూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** మండల కేంద్రం గ్రంథాలయంలో జరుగుతున్న జాతీయ వారోత్స వాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు గ్రంథాలయ లైబ్రేరియాన్ నిరూప ఆద్వర్యంలో ఎస్నార్ రంగనాథన్ ,పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతూ మంచి జరిగేటప్పుడు చెడు ఎదురవుతుందని దానిని ఆత్మ ధైర్యంతో ఎదుర్కొని విజయాలు సాధించాలని పిల్లలకు సూచించారు. అదేవిధంగా జీవితంలో జరిగేటటువంటి అనేక పరిణామాలకు ఎవరు భయపడకుండా ఎదుర్కోవాలని తెలియజేశారు. గ్రంథాలయంలో మంచి భవిష్యత్తు, జ్ఞానోదయం కోసం పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి వాటిని వినియోగించుకొని ఉన్నత చదువులు చదివి మంచి పేరు పొందాలని వివరించి తెలిపారు.అ పిల్లలకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## వెంకయ్య స్వామికి పూజలు



విడవలూరు, నవంబర్ 16, ప్రభాతవార్త విడవలూరు పశు వైద్యశాల ఆవరణం గుడ్లూరు శ్రీనివాసులు నివాసంలో వెలసియున్న వెంకయ్య స్వామికి కార్తీకమాసం సందర్భంగా శనివారం పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకం, పూలంగి సేవ కార్యక్రమాలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, భక్త భజన మండలి వారిచే భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ వ్యవస్థాపకులు వ్యవహరించారు.

## సీసీ రోడ్లకు శంకుస్థాపన



**వరికుంటపాడు,నవంబర్ 16,ప్రభాతవార్త :** ఉదయగిరి నియోజకవర్గ శాసన సభ్యులు కాకర్ల సురేష్ నేతృత్వంలో ప్రతి గ్రామము అభివృద్ధి వైపు పరుగులు తీస్తుందని తూర్పు రొంపిదొడ్ల తెలుగుదేశం పార్టీ నేతలు మల్లంపాటి వెంగయ ,కూండ్ల నాగేష్,నందిపాటి ఆరోన్,మల్లంపాటి ప్రసాద్‌రావు లు అన్నారు. శనివారం తూర్పు రొంపిదొడ్ల గ్రామంలోని ఎస్సీ కాలనీ లో,శశ్మాన వాటికకు వెళ్లే దారికి సిమెంట్ రోడ్ల నిర్మాణానికి నేతలు శంకుస్థాపన చేసారు.ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ గ్రామంలో ప్రధానంగా ఎస్సీ కాలనీ లో సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు.ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ సహాకారంతో గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామన్నారు.ఈ కార్యక్రమములో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నీటి సంఘాల ఎన్నికలు సిబ్బంది కి శిక్షణ



**వరికుంటపాడు,నవంబర్ 16,ప్రభాతవార్త :** ఈ నెల 23 వ జరగనున్న నీటి సంఘాల ఎన్నికలకు సంబందించిన పీఓ,ఎపిఓ లకు శనివారం స్థానిక స్త్రీ శక్తి భవనంలో సోమశిల ప్రాజెక్టు డీఈఈ శ్రీనివాస కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమము నిర్వహించారు.ఎన్నికల సమయంలో ఎన్నికల సిబ్బంది విధులు,భాద్యతలపై అవగాహన కల్పించారు.గండిపాళెం ప్రాజెక్టు పరిధిలో ఉన్న నీటి సంఘాలకు 23 వ తేది ఎన్నికలు జరుగుతాయని,అందులో ఎన్నికల అధికారులు ఎలాంటి పొరపాట్లు జరుగకుండా విధులు నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమములో తహశీల్దార్ పసుపులేటి హేమంత్ కుమార్,ఇరిగేషన్ జెఈఈ అంకులయ్య తదితరులు పాల్గొన్నారు.

## చిరమనలో కార్తికపౌర్ణమి వేడుకలు



అనుమసముద్రంపేట, నవంబర్16 ప్రభాతవార్త: ఏఎస్‌పేట మండలం లోని చిరమన గ్రామంలో వెల సియున్న శ్రీకామాక్షిదేవి సమేత చంద్రమౌలేశ్వరస్వామి వారి శివాల యంలో కార్తీక పౌర్ణమి వేడుకలను ఆలయ ధర్మకర్త కాటంరెడ్డి రవీం ద్రారెడ్డి, నర్సింహారెడ్డిల పర్యవేక్ష ణలో ఉభయదాత కర్నాటి మధుసూధన్‌రెడ్డి–రాధ ఆధ్వర్యం లో స్వామి , అమ్మవార్లకు ప్ర త్యేక అభిషేకాలు నిర్వహించా రు. స్వా ములకు బిక్ష కార్య క్రమం ఏర్పాటు చేశారు. శ్రీకామాక్షిదేవి చంద్రమౌళేశ్వర స్వామి వార్ల ఉత్స వ విగ్ర హాలకు ప్రత్యేక అలంకరణ చేసి ఆలయ ఆవరణలో పల్లకి సేవ నిర్వహజంచారు. వివిధ గ్రా మాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పూజారి సురేష్‌స్వామి ఆధ్వర్యంలో పూజలునిర్వహించారు.పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పండుగ వాతావరణం నెలకొంది.

## క్రీడల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సన్మానం



అనుమసముద్రంపేట,నవంబర్16ప్రభాతవార్త: ఏఎస్‌పేట మండల కేంద్రంలోని స్థానిక కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభకనపరచిన విద్యార్థులకు హెడ్స్ సంస్థ డైరెక్టర్ వెలగపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విద్యాలయం ఎస్.ఓ శ్రీలక్ష్మమ్మ అధ్యక్షతన ప్రతిభా పురస్కారాలను అందజేశారు. బాలల దినోత్స వారోత్స వాల్లో భాగంగా శనివారం ప్రతిభా పురస్కారాలు బహుమతులు అందజేశారు. దివంగత వెలగపాటి శివరామయ్య – చెన్నమ్మల జ్ఞాపకార్థం కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయం నుండి రాష్ట్ర స్థాయి జిల్లా స్థాయిలో ఆటలు పోటీల్లో గెలుపొందిన బాలికలకు శాలువాలు కప్పి బొకేలు , బహుమతులతో సన్మానించారు.విద్యార్థుల ప్రతిభకు కారణమైన పిఇటి ఉపాధ్యాయురాలు పి.రమాదేవి, ప్రిన్స్‌పాల్ శ్రీలక్ష్మమ్మలను శాలువాలు, బొకేలతో సన్మానించారు.

## మాలకొండ ఆదాయం రూ.11.3లక్షలు

**వలేటివారిపాలెం నవంబరు 16, ప్రభాతవార్త**మండలంలోని మాలకొండ నందలి శ్రీమాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామివారిని శనివారం పలువురు భక్తులు దర్శించి పూజాకార్యక్రమాలు నిర్వహించారు.తద్వారా సా ్వమివారికి రూ.11,33,477ల మేర ఆదాయం సమకూరింది.భక్తుల సందర్శనతో స్వామివారికి అష్టోత్తర పూజ లవలన రూ.10,800లు,కుంకుమార్చన పూజలద్వారా రూ.21,640లు, వివా హాల నిర్వహణ వలన రూ.12,000లు,తలనీలాలు టిక్కెట్లువలన రూ.32, 700 లు, వాహనపూజల వలన రూ.2,680లు,ప్రత్యేకదర్శనం రూ.2,84, 900లు, స్థలపురాణం పుస్తకముల అమ్మకం వలన రూ.600లు, రూముల అద్దెలు వలన రూ.33,120లు,కవర్లు అమ్మకం వలన రూ.7,500 లు,అన్నదానం నిమిత్తం రూ.5,08,977లు,లడ్డుప్రసాదం అమ్మకాల వలన రూ.2,08,540లు విరాళాలు వలన రూ.10,000లు చొప్పున భక్తులు స్వామి వారికి సమర్పించారు.

## గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకం ఎంపిడిఒ ప్రసన్నకుమారి




**అనుమసముద్రంపేట,నవంబర్16ప్రభాతవార్త:** పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని ఎంపిడిఒ ప్రసన్నకుమారి పేర్కొన్నారు. మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, విలేజ్ ఆర్గనైజేషన్ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు ఇతర మండల స్థాయి అధికారులకు శనివారం శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని కోర్స్ డైరెక్టర్ అయిన ఎంపిడిఒ అంబేద్కర్, గాంధీజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి శిక్షణా తరగతులను ప్రారంభించారు. గ్రామ పంచాయతీ విధులు, బాధ్యతల గురించి వివరించిన ఎంపిడిఒ గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అని గ్రామ పంచాయతీల్లో ప్రణాళికాబద్ధమైన కార్యాచరణతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సూచించారు. ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి పంచాయతీలకు వస్తున్న నిధులు, గ్రామ పంచాయతీల ఆదాయ వనరులను కలుపుకొని చేపట్టాల్సిన పనులను రూపొందించుకోవాలన్నారు. జిపిడిపి ప్రాముఖ్యత, ఆవశ్యకతను వివరించారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలు , వీధి దీపాల నిర్వహణ, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ తప్పనిసరిగా చేపట్టాలని ఇఓపిఆర్‌డి రమేష్ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టిఓటిలు దామోదర్, షేక్ సయ్యద్‌బాబా, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, విలేజ్ ఆర్గనైజేషన్ సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లు , మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మహిళ కండక్టర్‌ని పరామర్శించిన సీపీఐ నాయకులు



**కందుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** మహిళ కండక్టర్‌పై పాసవిక దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సీపీఐ ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తెలిపారు. బాధితురాలు సీహెచ్ సుభాషినిని సీపీఐ, ఏఐటీయుసీ, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో శనివారం పరామర్శించారు. నారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉన్న మహిళ కండక్టర్‌పై రాక్షసంగ ప్రవర్తించిన పత్తిపాటి హరిబాబుని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన అన్నారు. జనం అందరూ చూస్తుండగానే మహిళపై పైశాచికంగా ప్రవర్తించిన వ్యక్తిని కఠినంగా శిక్షించకపోతే మహిళా ఉద్యోగులు అభద్రతాభావంతో ఉద్యోగం చేయాల్సి వస్తుందని ఆయన అన్నారు. హరిబాబుని కఠినంగా శిక్షించని యెడల ఆందోళన చేయాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ప్రకాశం జిల్లా సహాయ కార్యదర్శి ఆర్.వెంకటరావు, ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షులు ఎస్‌డీ యాసిన్, నెల్లూరు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి మాలకొండయ్య, కందుకూరు నియోజకవర్గం కార్యదర్శి బి.సురేష్‌బాబు, సహాయక కార్యదర్శి బాల కోటయ్య, ఎస్టీయూ రాష్ట్ర నాయకులు సీహెచ్ ఆదినారాయణ, ఎంప్లాయిస్ యూనియన్ నెల్లూరు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డీవై కొండలు, ఉపాధ్యక్షులు బాబురావు, కందుకూరు డీపో అధ్యక్షులు మహేష్, సెక్రటరీ ఎంఎస్‌ఎస్ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శివకృష్ణ, జాయింట్ సెక్రటరీ ఎస్‌కే ఖాజావలి, కనిగిరి నియోజకవర్గం సీపీఐ సహాకార దర్శి జీపీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి



**ముత్తుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** బ్రహ్మదేవం గ్రామంలో ఇటీవల అనారోగ్యానికి గురైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టపు కృష్ణయ్యని, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మెంటా సుబ్బయ్య తల్లి అమ్మణ్ణమ్మ మరణించడంతో, వారి కుటుంబసభ్యులను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలతో మాట్లాడుతూ జమిలీ ఎన్నికలు రానున్న నేపథ్యంలో 2026 సంవత్సరంలోనే సార్వత్రిక ఎన్నికలు జరగనున్నడంతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా, ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ, సంక్షేమ పథకాలను సమర్ధవంతంగా, సంపూర్ణంగా అందజేశారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, మోసపూరితమైన వ్యాఖ్యలు చేయడం అన్యాయం అని ఎద్దేవ చేసారు. చంద్రబాబు బడ్జెట్ ప్రవేశపెట్టడానికి మీనమేషాలు లెక్కించి, ప్రజలకు ఇచ్చిన హామీల ఊసే లేకుండానే, బడ్జెట్ ప్రవేశపెట్టడం దుర్మార్గమన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎన్నడూ లేని అవినీతి తాండవిస్తుందే తప్ప, అభివృద్ధి జాడలు కనిపించడం లేదని తెలిపారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి నేతృత్వంలో ఇసుక, బూడిద, మట్టి, గ్రావెల్, మద్యం, రియల్ ఎస్టేట్ మాఫియాలు చెలరేగిపోతున్నాయని మండిపడ్డారు. సోమిరెడ్డి ఇరిగేషన్ పనులు చేయకుండానే, ఇరిగేషన్ శాఖ అధికారుల అండతో 6 కోట్ల రూపాయల దోపిడీకి పాల్పడుతున్నాడని ఆరోపించారు. రైతులను అడ్డుపెట్టుకొని దొంగ బిల్లులు స్వాహా చేసేందుకు ప్రయత్నిస్తున్న సోమిరెడ్డికి, సహకరిస్తున్న ఇరిగేషన్ అధికారులు ఉద్యోగాలు కోల్పోవడంతో పాటు, జైళ్లకి వెళ్లే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు. సర్వేపల్లిలో ఇరిగేషన్ శాఖలో జరుగుతున్న విచ్చలవిడి అవినీతిపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి, తగు చర్యలు తీసుకోవల్సిందిగా మాజీ మంత్రి గోవర్ధన్ రెడ్డి కోరారు. మాజీ మంత్రి కాకాణి వెంట ముత్తుకూరు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ మెట్ట విష్ణువర్ధన్ రెడ్డి, జెడ్పిటిసి సభ్యులు బందిల వెంకటసుబ్బయ్య, ముత్తుకూరు మండల పరిషత్ అధ్యక్షురాలు గండవరం సుగుణమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు పోలిరెడ్డి చిన్నప రెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారం




**సైదాపురం, నవంబర్ 16, ప్రభాతవార్త** విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో రూ. 6072కోట్లు ప్రజలపై మోపే భారాన్ని ప్రభుత్వమే భరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా కార్యదర్శి డీపీ పోలయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సైదాపురంలోని సబ్ స్టేషన్ వద్ద శనివారం విద్యుత్ భారంపై నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి విద్యుత్ శాఖ ఏఈకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా డీపీ పోలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబుకూటమి ప్రభుత్వం విద్యుత్ ట్రూ ఆఫ్ ఛార్జీల పేరుతో ప్రజలపై భారాన్ని మోపిందని ఎన్నికల సమయంలో ట్రూ ఆఫ్ ఛార్జీల భారాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చి నేడు కూటమి ప్రభుత్వం మాట తప్పిందని తెలిపారు. 2023–24 సంవత్సరానికి సంబంధించి మరో 11వేల 826 కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై వేయడానికి ప్రభుత్వం సిద్దం చేస్తుందని అన్నారు. తక్షణమే కరెంటు ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, లేని పక్షంలో దశల వారీగా ఆందోళన కార్యక్రమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయు జిల్లా నాయకులు చంగల్‌రావు, పి.వెంకటయ్య, వెంకటరమణయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

## గడువులోగా మినీ గోకులాలు నిర్మాణాలు పూర్తి చేయాలి



**ఉదయగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా సీసీ రోడ్లు, మినీ గోకులాలు నిర్మాణాలు గడువులోగా పూర్తి చేయాలని ఏపీవో శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1వ తేదీ లోపు ఉపాధి హామీ పథకం ద్వారా చేస్తున్న పనులను పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. మండ లంలో 23 మినీ గోకులాలు, 38 సిమెంటు రోడ్లు మంజూరయ్యాయన్నారు.

## వైసిపి సోషల్‌మీడియా వెంకట్రామిరెడ్డి అరెస్టు

కావలి, నవంబర్ 16 ప్రభాతవార్త గుంటూరు నగరపాలెంకు చెందిన వైసిపి సోషల్ మీడియా మేకా వెంకట్రామిరెడ్డిపై కావలి ఒన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో టిడిపి కావలి నియోజకవర్గ యస్‌సిసెల్ అధ్యక్షుడు దావులూరు దేవకుమార్ మాదిగ్ ఫిర్యాదుచేశారు. ఈ ఫిర్యాదును పురస్కరించుకుని కావలి పోలీసులు ఆయనను శనివారం అరెస్టుచేసి కావలి న్యాయమూర్తివద్ద హాజరుపరిచారు. న్యాయమూర్తి రిమాండ్ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లపై సోషల్‌మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనను రాజమండ్రి జైల్‌లో ఉంచారు. కావలి ఒన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదును పురస్కరించుకుని పోలీసులు వెంకట్రామిరెడ్డిని కావలి న్యాయమూర్తిముందు హాజరుపరిస్తే రిమాండ్ ఇచ్చారు.

## గ్రంధాలయ వారోత్సవాలు



**ఉలవపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త** జాతీయ గ్రం ధాలయ వారోత్స వాల్లో భా గంగా శనివారం మూడో రో జు గ్రంధాలయ అధికారి దా సరి కోటేశ్వరరావు ఆధ్వర్యం లో పాఠశాల విద్యార్థులకు స్వామి వివేకానంద జీవితవిశేషాలు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వ హించారు. ఈ సందర్భంగా రగంధపాలకుడు మాట్లాడుతూ విద్యార్థులు అంద ూరూ పుస్తకాలు ఎక్కువగా చదవాలని, పుస్తకం ప్రతి విద్యార్థికి మంచి నేస్తం అని దాని వలన ఎక్కువ విషయాలు తెలుసుకోగలరని ఆయన అన్నారు. ఈ వ్యా సరచన పోటీలకు వివిధ పాఠశాల విద్యార్థులు 70 మంది పాల్గొన్నారు. విద్యా ర్థులను పంపి సహకరిస్తున్న పాఠశాల యాజమాన్యాలకు గ్రంధపాలకుడు దాసరి కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎరువుల ధరల వివరాలు నోటీస్‌బోర్డులో పెట్టాలి



వలేటివారిపాలెం నవంబరు 16, ప్రభాతవార్త ఎరువు ల ను,పురుగు మందులను ఎమ్మార్పీ రేట్లకే అమ్మాలని కావలి వ్యవసాయశాఖ సహాయసంచాలకులు డా॥ సిహె చ్.నాగరాజు ఎరువుల షాపు ల యజమానులకు సూచించారు. ధరల వివరాలను ఆయా షాపుల ఎదుట నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని షాపులు యజమానులను కోరారు.ఇందుకు విరుద్దంగా వ్యవహరిస్తే స్థానిక వ్యవసాయాధికారికి పిర్యాదుచేయలని ఆయన రైతులుకు విజ్ఞప్తిచేశారు.అటువంటి డీలర్లుపై ఎరువులచట్ట ం 1985 ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.శనివారం ఆయన మండలలోని బడేవారిపాలెం సొసైటీతోపాటు పోకూరు,వలేటివారిపాలెంలలోని ఎరువులు మరియు పురుగుమందుల విక్రయషాపులను స్ధానిక వ్యవసాయ అధికారి హేమంత్ భరత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లంతా షాపుల ఎదుట డీలరు షాపు పేరు, లైసెన్సు నంబరు, అడ్రస్ బోర్డు, ప్రదరి ్శంచా లన్నారు. లైసెన్సులో ఎరువులను సరఫరా చేసే కంపెనీల ఉత్పత్తులను ఫారం ఓ ద్వారా పొందుపరచాలని,ఎరువులను ఎమ్మార్పీ రేట్లకే అమ్మాలని,రైతుకు తగిన రశీదు ఇవ్వాలని నోటీస్‌బోర్డులో అమ ్మకపురేట్లు నిల్వ చూపించాలని బిల్‌బుక్‌లో రైతు సంతకం,డీలర్లు సంతకం ఉండాలని, పాస్ బుక్ రైతు విస్తీర్ణం బట్టి బయోమెట్రిక్ ఆధారంగా వేలిముద్రవేసుకొని,ఎరువులను పంపిణీచేయాలని తెలిపారు.తదుపరి ఎలక్ట్రానిక్ మిషన్‌ద్వారా నిల్వ ఉన ్న ఎరువులను, భౌతికంగా నిల్వఉన్నఎరువులను పరిశీలించారు.ఇందుకు విరుద్దంగా డీలర్లు వ్యవహరిస్తే వ్యవసాయ అధికారికి పిర్యాదుచేయాలని రైతులుకు సూచించారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ



**ఇందుకూరుపేట, నవంబర్ 16, ప్రభాతవార్త** మండలంలోని కుడితిపాలెం గ్రామంలో కోటేశ్వరి స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో కాకర్ల దిబ్బ చల్లాయనాధులు కాలనీలోని నిరుపేదలకు నిత్యావసరాల సరుకుల పంపిణీ కార్యక్రమం శనివారం నిర్వహించారు. 53 కుటుంబాల వారికి పట్టలు, నిత్య వసర సరుకులు ఏఆర్‌డీ సిబ్బంది కోటేశ్వరి స్వచ్ఛంద సేవా సంస్థ సహ కారం తో సచివాలయం సిబ్బందితో కలిసి అందజేశారు. సర్పంచ్ నాయుడు సురేష్, మెట్ట శ్రీనివాసులురెడ్డి, సిగనం రవి, వల్లమూడి శ్రీకాంత్, ఏఆర్డీ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులు, యువత గ్రంధాలయాలను సందర్శించాలి



**కావలిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త** సమాజంలో విద్యార్థులు, యువత గ్రంధాలయాలను తరచుగా సందర్శించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విక్రమసింహపురి యూనివర్సిటి కావలి పి.జి సెంటర్ ప్రొఫెసర్ శైలజ తెలియ చేశారు. 57వ జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా కావలి వెంగళరావు నగర్‌లోని ప్రభుత్వశాఖ గ్రంధాలయంనందు గ్రంధాలయ ఉద్యమపితామహుల చిత్రపటాలకు పూలమాలలువేసి శనివారం ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా ప్రొఫెసర్ శైలజ పాల్గొని మాట్లాడారు. ప్రజలు దేశభక్తిని పెంపొందించుకోవాలన్నారు. గ్రంధాలయాల విశిష్టతపై అవగాహన పెంచుతూ గ్రంధాలయ పితామహులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఐయ్యంకి వెంకటరమణయ్య, యస్ఆర్ రంగనాధన్, పాతూరి నాగభూషణం, వావిలాల గోపాల కృష్ణయ్యబాంటి పెద్దల కృషిని, త్యాగాలను తెలియచేశారు. గ్రంధాలయ అధికారిణి యస్ సునీత మాట్లాడారు. ప్రజలు తరచుగా గ్రంధాలయాలను సందర్శించి పుస్తక జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కోరారు. గ్రంధాలయాల అభివృద్ధి కమిటి సభ్యులు యం.మాలకొండారెడ్డి మాట్లాడారు. ప్రభుత్వాలు గ్రంధాలయాలు అభివృద్ధిచేసి నూతన భవనాలను నిర్మించి మహనీయుల ఆశయాలను నెరవేర్చాలని తెలియచేశారు. పాఠకులు,పాల్గొన్నారు.

## మానస పాఠశాలలో విద్యార్ధులకు డ్రాయింగ్ పోటీలు



చేజర్ల నవంబర్ 16ప్రభాతవార్త జాతీయ గ్రంధాలయ వారోత్సవాలలో భాగంగా చేజర్లలలోని మానస ప్రవేటు పాఠశాలలో విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్బంగా శనివారం మానస పాఠశాలలో ఆరవ తరగతి ,ఏడవ తరగతి విద్యార్ధిని విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి గ్రంధాలయ వారోత్సవాలపై విద్యార్ధిని, విద్యార్థులకు అవగాహన కల్పిం చారు. గ్రందాలయాధికారిని కల్పన పాఠశాల ఉపాధ్యాయులు పాల్గోన్నారు.

## ఆర్డీఓను కలిసిన జిల్లా మానిటరింగ్ కమిటిసభ్యులు సాయిప్రసాద్



కావలిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త కావలి రెవిన్యూ డివిజనల్ అధికారి వంశీకృష్ణను పలుసమస్యలపై శనివారంజిల్లా యస్సి,యస్టి,విజిలెన్స్, మానిటరింగ్ కమిటి సభ్యులు ఐ.సాయిప్రసాద్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా సాయిప్రసాద్ మాట్లాడారు. ఇటీవల కాలంలో కురిసిన వర్షాలకు అట్టడుగు పేదప్రజలు నివసించే యస్సి మరియు యస్టి కాలనీల్లో చెత్త, చెదారం పేరుకుపోయి అపరిశుభ్రవాతావరణం ఏర్పడి అక్కడ నివసించే ప్రజలకు తీవ్రఅసౌకర్యం ఏర్పడి అనారోగ్యంపాలవుతున్నారని తెలియచేశారు. ముఖ్యంగా బలహీనవర్గాలకు చెందిన ప్రజలు నివసించే ప్రాంతాలలో మురుగునీరు కాలువలలో వ్యర్ధపదార్దాలుచేరి దోమలు, ఈగలు ఎక్కువగా ఉత్పత్తిఅయ్యి ఆయా కాలనీల్లో ఉండే ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలియచేశారు. యస్సి, యస్టి కాలనీల్లో ఉన్న ప్రభుత్వ బావులను శుద్దిచేసి మంచినీటిని పేదప్రజలకు అందుబాటులోకి తేవాలని తెలియచేశారు. యస్సి,యస్టి కాలనీల్లో ఉన్న డ్రాఫ్అవుట్ పిల్లలను గుర్తించి వారిని బడికివెళ్లే విధంగా ఆయా మండలాల యంఈఓలకు ఆదేశాలివ్వాలని తెలియచేశారు. అర్హులైన గిరిజనులకు ఆయా ప్రభుత్వరంగ సంస్థలద్వారా రుణములనుఏర్పాటుచేసి వారిని వ్యాపారవేత్తలుగా తయారుచేయాలని కోరారు. అలాగే ఆర్డీఓ పరిధిలో ఉన్న యస్సి అండ్ యస్టి కాలనీల్లో నివసించే ప్రజలకు పూర్తిఆరోగ్యభద్రతను కల్పించాలని కోరారు.

## విద్యార్థులు చదువుతోపాటు సమాజాన్ని గురించి చదవాలి



**బుచ్చి నవంబర్ 16 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్‌లో జరిగిన బాలల దినోత్సవ కార్యక్రమాంలో భాగంగా విద్యార్థులకు ప్యాన్సీ డ్రస్సుల పోటోలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిధిగా మైధిలీ స్కూల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ డైరక్టర్ శశిప్రియ పాల్గోన్నారు.ఈ సందర్బంగా ఆమె మాట్లాడుతు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు,పెరిగి పెద్దయిన గ్రామానికి,మన దేశానికి, కూడా సేవ చేయాలనే ఆలోచన కలిగించడమే చదువు యొక్క ముఖ్య ఉద్దేశం అని ఆమె తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు సమాజం గురించి కూడా తెలియజేయాలని అన్నారు. అనేకమంది మహాను భావులు సమాజాన్ని గురించి కూడా ఆలోచించి గొప్ప వాళ్ళు అయ్యారని చెప్పారు. అనంతరం కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గోన్న రోటరీ క్లబ్ ట్రెజరర్ సరాబు నాగయ్య మాట్లాడుతు శ్రీగోపాలకృష్ణయ్య స్కూల్ వారు ఎప్పటికప్పుడు విద్యార్ధులలో చైతన్యం తీసుకొని రావాలని పలు కార్యక్రమాలు నిర్వహిస్తుంటురని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా అతిధులు విద్యార్దులకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల కరస్పాండెంట్ నేలనూతల శ్రీదర్, ప్రిన్సిఫల్ సురేఖ, ఉపాధ్యాయులు గిరిజ, విజయలక్ష్మీ,వెంకటలక్ష్మీ ఆమని అనిత పాల్గోన్నారు.

## గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు నివాళులు



**వింజమూరు,నవంబర్16ప్రభాతవార్త:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మూడవరోజు వింజమూరులోని గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులకు గ్రంథాలయ అధికారి జ్యోతి కొండయ్య, పిఇటి ఎస్.మాచర్ల విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయ ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు డాక్టర్ ఎస్.ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, ఐఎన్‌జి వెంకటరమణయ్యలు చేసిన సేవలను, ఉద్యమాలను గురించి వివరించారు. గ్రంథాలయ ఉద్యమ నాయకుల పోరాటం ఫలితంగా గ్రంథాలయాలు బలోపేతమై నేటి విద్యార్థులకు విజ్ఞానవంతమైన ఆలయాలుగా విరాజిల్లుతున్నాయన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగంచేసుకొని తమ భవిష్యత్తును నిర్దేశించుకోవాలన్నారు. అనేక రంగాలకు సంబంధించిన విజ్ఞానాన్ని ,అవసరాలను గ్రంథాలయాలు తీరుస్తూ బంగారు భవితకు బాటలు వేసే ఆలయాలన్నారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

## పోలింగ్ అధికారులకు శిక్షణ



**వింజమూరు,నవంబర్16ప్రభాతవార్త:** మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశమందిరంలో జలవనరుల శాఖ ఆధ్వర్యంలో శనివారం సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల అధికారులకు, పోలింగ్ అధికారులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈసందర్భంగా వింజమూరు ఇరిగేషన్ డిఇ రమణరావ్ మాట్లాడుతూ నీటి పారుదల వ్యవస్థ యాజమా న్యంలో రైతులకు భాగస్వామ్య కల్పన, నీటి పారుదల వ్యవస్థ సక్రమ నిర్వహణ, సమర్థవంతమైన నీటి పంపిణీ, వ్యవసాయ ఉత్పత్తుల అభివృద్ధి, ఆర్థిక వనరుల అభివృద్ధి, సాగునీటి వినియోగదారుల సంఘాలకు అవకాశం కల్పిస్తారన్నారు. ఈఎన్నిక ఎంపిక క్రమంలో ఎన్నికల అధికారులు, పోలింగ్ అధికారులు నీటి వినియోగదారుల సంఘాల పరిధిని నిర్ణయించడం, నిర్ణయించిన నీటి వనరులకు భూస్థితి గల వారు, ఓటర్ల జాబితా తయారీ , ప్రచురణ, 1లో నిర్ణయించిన పరిధిలోని అర్హత కలిగిన రైతుల నుండి 2లో ప్రచురించిన ఓటర్ల ద్వారా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులను టిసి మెంబర్లుగా ఎన్నుకుంటార న్నారు. తద్వారా నీటి సంఘం యాజమాన్యం కమిటీని నిర్ణయించడం జరుగుతుందన్నారు. ప్రతి టిసి కోసం ప్రత్యేక ఏర్పాట్లను ఒక నీటి వినియోగదారుల సంఘంలోని అన్ని టిసిలకు ఒకే ప్రాంగణంలో ఎంపిక జరగాలన్నారు. ప్రతి సంఘానికి ఒక ఎన్నికల అధికారి, అవసరాన్ని బట్టి సహాయక ఎన్నికల అధికారిని నియమిస్తారన్నారు. ఎన్నికల అధికారికి సహాయ పడేందుకు నీటి సంఘంలోని ఒక్కో ప్రాదేశిక నియోజకవర్గానికి ఒక పోలింగ్ అధికారిని , ఒక సహాయకుడిని నియమిస్తారన్నారు. పోలింగ్ అధికారి ఎన్నిక, ఎంపిక నిస ్పక్షపాతంగా, శాంతియుతంగా జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ అధికారి సంబంధిత రెవెన్యూ అధికారి జారీ చేసిన పట్టాదారు పాస్‌పుస్తకం, పాన్‌కార్డ్, ఆధార్‌కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ తదితరాలను చూపవచ్చున్నారు. పోలింగ్ అధికారి ఓటర్లను తమ ప్రతినిధిని ఎంపిక చేసుకునేందుకు పురుషులను, మహిళలను వేరు వేరు వరుసల్లో కూర్చొబెట్టాలన్నారు. ఏకాభిప్రాయం ద్వారా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుడిని ఎంపిక చేస్తే ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే ప్రోత్సాహక మంజూరుతో అటువంటి ప్రాదేశిక నియోజకవర్గం ప్రోత్సహించబ డుతుందన్నారు. నామినేషన్ల జాబితా తయారీ, నామినేషన్ల పరిశీలన, పోటీదారుల తుది జాబితా తయారీ తదితర బాధ్యత ఎన్నికల అధికారిదేనన్నారు. ఓటు హక్కు కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికలను నిర్వహిం చాలన్నారు. తహసిల్దార్ హమీద్, ఎంపిడిఒ శ్రీనివాసులురెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

## జోరుగా టిడిపి సభ్యత్వాలు



**వింజమూరు,నవంబర్16ప్రభాతవార్త:** వింజమూరులో తెలుగుదేశంపార్టీ సభ్యత్వాలను టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్నాయి. భారతదేశంలో వివిధరాష్ట్రాల్లో ఉన్న ప్రాంతీయ రాజకీయ పార్టీలకన్నా తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు చేకూరే ప్రయోజనాలను వివరించారు. 5లక్షల ఇన్సూరెన్స్, మట్టిఖర్చులకు 10వేల రూపాయలు అందిస్తారన్నారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాలమేరకు మండలంలో సభ్యత్వాలను పెద్ద ఎత్తున చేపడుతున్నామని చల్లా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మాజీ పట్టణ అధ్యక్షుడు మంచాల శ్రీనివాసులునాయుడు, నాయకులు కర్నం శ్రీనివాసులునాయుడు, తిరుపతాచారి,సోషల్‌మీడియా అధ్యక్షుడు ఆరికొండ శ్రీనివాసులు, కటకం ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేప్రాంత అభివృద్ధికై ప్రజాప్రతినిధులకు వినతి



**బిట్రగుంట, నవంబర్16, ప్రభాతవార్త:** శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్ల బోగోలు మండలం రైల్వేబిట్రగుంటలో నిరుపయోగంగవున్న కోట్లాదిరూపా యల విలువ చేసే రైల్వేభూములను సద్వినియోగం చేసుకునేల ఏదైన యూనిట్‌ని ప్రారంభించేందుకు కేంద్రప్రభుత్వంపై వత్తిడి తేవాలని బిట్రగుంట రైల్వేప్రాంత అభివృద్ధి అసోసియేషన్ కమిటి అధ్యక్షుడు సి నరహరి డిమాండ్ చేశారు.స్థానిక సిపిఎం కార్యాలయంలో శనివారం విలేఖర్ల సమావేశం ఏర్పాటుచేసి మాట్లాడుతు ఇందుకోసం కూటమి ప్రభుత్వం కేంద్రంపై వత్తిడితేవాలని కోరుతు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జిల్లాకు చెందిన మంత్రులు ఎంఎల్ఎలకు రిజిస్టర్‌పోస్ట్‌లో వినతిపత్రాలు పంపామని తెలి పారు. తక్షణమే జిల్లాకు చెందిన మంత్రులు శాసనసభ్యులు దీనిపై దృష్టిసారించి ముఖ్యమంత్రి ఉపముఖ్యమంత్రిద్వార పార్లమెంటులో వత్తిళ్ళుతేవాలని డిమాండ్‌చేశారు సమావేశంలో సిపియం మండలకార్యదర్శి తుమ్మల వెంకయ్య రైల్వే అభివృద్ధికమిటి సభ్యులు ఎస్‌కె నూరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## 57 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**కలువాయి నవంబర్ 16 ప్రభాతవార్త** మండలంలోని కుల్లూరు, కలువాయి శాఖ గ్రంథాలయం వారి ఆద్వర్యంలో గ్రం థాలయాధికారి పి.సుధాకర్ 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమాలలో పోరాటాలు చేసిన ఐఎన్‌జి వెంకటరమణయ్య ,డాక్టర్ ఎస్ఆర్ రంగనాదన్,తాచూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్దుల కోసం వారోత్సవాలలో భాగంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శన ఆకట్టుకుంది. పుస్తక ప్రదర్శనలో ఆధ్యాత్మిక గ్రందలు రామాయణం,భగవతం అదే విధంగా ఆరోగ్యానికి సంబందించిన పుస్తకాలు హాస్యకధల పుస్తకాలు,వంటల పుస్తకాలు నీతికధల పుస్తకాలను ప్రదర్శ నలో ఉంచారు. బివిఎన్ఆర్ జడ్‌పిహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు అబ్బాస్ అలీ, పాఠశాల లైబ్రరీయన్ జ్యోతి పుస్తక ప్రియులు విద్యార్దులు పాల్గొన్నారు.

## శనిచక్రవర్తి ఆలయంలో అన్నదానం

విడవలూరు, నవంబర్ 16, ప్రభాతవార్త ముదివర్తి పెన్నానది తీరాన వెలిసియున్న శని చక్రవర్తికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అభిషేకం, అర్చన, రాహు కేతువులకు పూజ, హోమాలు నిర్వహించారు.పరిసర ప్రాంతాల నుండి భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ఆలయ వ్యవస్థాపకులు పరమేశ్వర్ రెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పాల్గొన్నారు.

## నేడు కొండబిట్రగుంటకు శృంగేరి పీఠాదిపతిరాక



**బిట్రగుంట, నవంబర్16, ప్రభాత వార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి కర్నాటకరాష్ట్రం శృంగేరి శారదా పీఠం పీఠాదిపతి శ్రీశ్రీ విదుశేఖర భారతి సన్నిదానం ఆదివారం సా యంత్రం రానున్నట్లు కావలి ఎంఎల్ఎ దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కార్యాలయం తెలిపా రు.కొండబిట్రగుంటలో నాలు గుదిక్కులు వాస్తులను సరిచేసి ఆలయ ప్రాకారం గాలిగోపురం నిర్మాణాలకు విధుశేఖర బారతిసన్నిదానం భూమిపూజ చేస్తారని పేర్కొన్నారు.రాష్ట్ర దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో జరిగే ఈకార్య క్రమంలో పలువురు ప్రముఖులు హాజరు కానున్నందున భక్తులు అదికసంఖ్యలో పాల్గొని పీఠాదిపతి ఆశీస్సులు పొందడంతోపాటు విజయవంతం చేయా ల్సిందిగ కోరారు.

## అన్నదాత సుఖీభవ కార్యక్రమం ప్రారంభం



**బిట్రగుంట, నవంబర్16, ప్రభాతవార్త:** బోగోలు మండలం కొండ బిట్రగుంట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శనివారం అన్న దాత సుఖీ భవ కార్యక్రమం దాతల సహకారంతో ఎంఇఒలు సరసింహరావు,జయమ్మలు ప్రారంభిం చారు,దాతల సహకారంతో 18సంవత్సరాలనుండివిద్యార్దులకు మద్యాహ్న భోజ ననందు అదనపు పోషకాహారం అందజేయడం అభినందనీయమ న్నారు.ఈకార్యక్రమానికి దాతగ రిటైర్‌ఎస్‌బిఐ మేనేజర్ కె వెంకయ్య పదివేల రూపాయలు ఇవ్వడాన్ని ఎంఇఒలు అభినందించారు.ఈకార్యక్రమంలో అల్లూరు ఎంఇఒలు ఎస్ సుమతిఎన్ రవీంద్రనాద్,లోక్ అదాలత్ సభ్యులు ఎం మాల కొండారెడ్డి,పాఠశాల ప్రదానోపాద్యాయుడు ఎం ప్రసాద్‌రావు,విద్యాకమిటి చైర్మన్ బి మధు వైస్ చైర్మన్ కౌసల్య,ఉపాద్యాయురాలు విజిత పాల్గొన్నారు.

## మండిన ట్రాన్స్‌ఫార్మర్.. తృటిలో తప్పిన ప్రమాదం



**కోవూరు, నవంబం16ప్రభాతవార్త :** కోవూరులోని బజార్ సెంటర్ సత్రం వీధి ప్రాంతంలో ఉన్న ట్రాన్స్ ఫార్మర్ నుంచి శనివారం ఉదయం ఒక్కసారిగా మంటలు ఎగిశాయి.వెంటనే సమాచారం తెలుసుకున్న ట్రాన్స్‌కో శాఖ సిబ్బంది విద్యుత్ సరఫరా ఆపి వేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఒకవేళ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు ఎగిసి ట్రాన్స్ పార్మర్ పేలి ఉంటే నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో పెద్ద ప్రమాదం జరిగేదని స్థానికులు వాపోతు న్నారు. ఈ విషయమై ట్రా న్స్‌కో ఏఈ మునిరాజాను ప్రభాత వార్త వివరణ కోరగా.. ట్రాన్స్‌ఫార్మర్ పక్కన కేబుల్ అంటుకుందని, వెంట నే విద్యుత్ సరఫరా ఆపివేశామని, ప్రస్తుతం ఈ ట్రాన్స్ పార్మర్ మరమ్మతుల్లో ఉందని, దీని ప్రదేశంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు

## వికలాంగుల క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



**కోవూరు, నవంబం16ప్ర భా తవార్త :** కేంద్ర ప్రభుత్వ సంస్థ సీఆర్‌సీ నెల్లూరు ఆధ్వర్యంలో కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో వికలాం గుల సంబంధించిన క్యాంపును నిర్వహి స్తున్నారని, దీనిని మం డలంలోని ది వ్యాంగులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీహరిరెడ్డి అన్నారు. కోవూరులోని ఎంపీ డీవో కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపుకు వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులు వారికి అవసరమైన మూడు చక్రాల బండ్లు, వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు మొదలగు ఉపకరణాలనుఅందిం చేందుకు ఎంపిక కార్యక్రమం నిర్వహించడం జరు గుతుందన్నారు. ఈ క్యాంపుకు వచ్చే దివ్యాంగులు, వయోవృద్ధులు వారికి సం బంధించిన సదరం సర్టిఫికేటు, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, జెరాక్స్‌లతో పా టు రెండు ఫొటోలను కూడా తీసుకురావాలన్నారు. ఈ క్యాంపులో అర్హత కలిగిన వారిని ఎంపిక చేసి వారికి ఉపకరణాలను అందజేయడం జరుగుతుందన్నారు.ఇటువంటిమంచి అవకాశాన్ని దివ్యాంగులు, వయోవృద్ధులుపూర్తి స్థాయిలో వినియోగించు కో వాలన్నారు.

## భేటీ బచావో.. భేటీ పడావో



కోవూరు, నవంబం16ప్రభాతవార్త : బాలికలు చదువుకుంటే ఆ కుటుంబం పూర్తిగా అభివృద్ధి పథంలో పయనిస్తుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని బాలికలను తల్లిదండ్రులు తప్పక చదివించాలని ప్రధానోపాధ్యాయురాలు రాధారాణి అన్నారు. కోవూరు మండలం ఇనమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మహిళా సాధికారత బాలల అభివృద్ధిపై సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో స్త్రీ సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి. హేనాసుజన సూచనల మేరకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు పెళ్లి వయస్సు వచ్చిన తర్వాతే వివాహాలు చేయాలని, బాల్య వివాహాలు చేయడం వలన అనేక ఇబ్బందులు తలెత్తే పరిస్థితి వస్తుందన్నారు. అదేవిధంగా ప్రాథమిక దశ నుంచి బాలికలు బలవర్ధకమైన పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలన్నారు. ముఖ్యంగా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని బాలింతలు, గర్భవతులు తప్పనిసరిగా కేంద్రంలో అందించే పౌష్టికాహారంతో పాటు గ్రామాల్లో లభించే పాలు, గుడ్లు, ఆకుకూరలు క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. సఖి వన్‌స్టాప్ సెంటర్ పారాలీగల్ ఎన్. ప్రశాంతి, సోషల్ కౌన్సిలర్ టి. కమల, కేస్ వర్కర్ జి. సాధన, ఉపాధ్యాయులు వసంత లక్ష్మి, శ్రీనివాసులు, రవిచంద్ర, తదితరులు ఉన్నారు.

## గిరిజనులను ఆదుకోవడమే లక్ష్యం పల్లం శేషమ్మ



విడవలూరు, నవంబర్ 16, ప్రభాతవార్త మండల కేంద్రం ఇందిరమ్మ కాలనీలో గిరిజనులు వర్షపు నీటిలో ఉంటూ జీవనం సాగిస్తున్న కుటుంబాలను ఎవరు కూడా పట్టించుకోకపోవడం బాధాకరమైన విషయమని దళిత నాయకురాలు పల్లం శేషమ్మ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల వర్షాలు ప్రారంభమైనప్పుడు నుండి గిరిజన ఇళ్లల్లోకి నీరు చేరి విషపురుగుల మధ్య బ్రతుకుతుంటే కనీసం అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. అనంతరం గిరిజన కుటుంబాలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. దీంతో గిరిజనులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

## పుస్తక పఠనం వలన అనేక ఉపయోగాలు

**డాక్యుమెంటు పోయినది**
పోకూరి మాదవ తండ్రి రామలింగయ్య డో.నెం: 11-26-10 పుట్టావారి వీధి, రామమూర్తి పేట, కావలి కు సంబంధించిన కావలి సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో డాక్యుమెంటు నెం: 15103/ 2024 గా రిజిస్టారు కాబడిన జలదంకి మం., అన్నవరం గ్రామంలోని ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్ కావలి నుండి ముసునూరుకు బైక్ పై వెళుచుండగా పోయినది. ఎవరికైనా దొరికిన యెడల క్రింది సెల్ నెంబరుకు తెలియజేయగలరు. సెల్: 9121321527

కోవూరు, నవంబం16ప్రభాతవార్త : వి ద్యార్థులు చిన్ననాటి నుంచి గ్రంథాల యానికి వెళ్లి పుస్తక పఠనం చేయడం ద్వారా వారిలో దాగి ఉన్న అనేక నైపు ణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని మహిళా పోలీస్ ఏ. దొరసా నమ్మ తెలిపారు.



కోవూరు లోని పచ్చి పాల శంకర్‌రెడ్డి శాఖ గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగం గా శనివారం గ్రంథాలయ ఉద్యమకారులైన ఐఐటీ వెంకటరమణయ్య, ఎస్ఆర్ రంగనాథన్‌ల చిత్రపటాలకు పూలమాల వేసి లైబ్రేరియన్ సురేంద్రరెడ్డి ఆధ్వర్యం లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంథాల యంలో చరిత్రకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయులు, కవుల గ్రం థాలు ఉన్నాయని, అటువంటి వాటిని విద్యార్థులు చదివి తమ మేదస్సును మ రింత ద్విగుణీకృతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగులు పి. సుబ్బరాయులు , పాఠకులు ఉన్నారు.

## పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించాలి



కోవూరు, నవంబం16ప్రభాతవార్త : కోవూరు మండలంలోని మూడు నీటి సంఘాలకు సంబంధించి త్వరలో జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాలు ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేలా సంబంధిత ఎన్నికల అధికార సిబ్బంది తగు చర్యలు తీసుకోవాలని డ్రైన్స్ డీఈ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం త్వరలో జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించి ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవూరు మండలానికి సంబంధించి కోవూరు, పాటూరు, ఇనమడుగు సాగునీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయన్నారు. ఒక్కొక్క సంఘానికి 12 మంది టీసీ సభ్యులను ఎన్నికల ద్వారా ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా ఎన్నికల్లో పోటీ చేసే పోటీదారుడు ఆ ప్రాదేశిక నియోజకవర్గ ఓటరు అయి ఉండాలి. పోటీదారుని యొక్క వయస్సు 18 సంవత్సరాలు పూర్తి అయి ఉండాలన్నారు. పోటీ చేసే వారు ప్రభుత్వం ఉద్యోగి అయి ఉండరాదన్నారు. అదేవిధంగా అతనిపై ఎటువంటి క్రిమినల్ కేసులు ఉండరాదన్నారు. దీంతో పాటు నీటి సిస్తు పూర్తిగా చెల్లించి ఉంటేనే అర్హత అన్నారు. ప్రతి ఎన్నికల అధికారులు , సిబ్బంది వారికి ఇచ్చిన ఎన్నికల నియమావళి పుస్తకాన్ని క్షుణ్ణంగా చదువుకుని అవగాహన చేసుకోవాలన్నారు. కోవూరు, ఇనమడుగు, పాటూరుకు సంబంధించి ఎన్నికలను ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ భవనాల్లో కానీ, కమ్యూనిటీ కేంద్రాల్లో కానీ నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలానంద బాబా, కోవూరు ఇరిగేషన్ ఏఈఈ శ్రీనివాసరావులు పలు సూచనలు చేశారు.

## ముగిసిన సీఆర్పీల ఆడిట్ శిక్షణ కార్యక్రమం



ఉదయగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త ఉదయగిరి స్త్రీ శక్తి భవన్‌లో ఆర్ధిక లావాదేవీలపై సీఆర్పీలకు ఎల్‌సీసీ సీసీల ఆధవర్యంలో మూడు రోజులు పాటు జరిగిన శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడు రోజులు పాటు ఈ శిక్షణ కార్యక్రమంలో ముఖ్యంగా పొదుపు సంఘాల నిర్వహణ, ఆర్ధిక లావాదేవీలు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు సురేష్, బాలగురవయ్యలు ఉన్నారు.

## సాగునీటి సంఘాల ఎన్నికల సిబ్బందికి శిక్షణ



**ఉదయగిరి, నవంబర్ 16, ప్రభాతవార్త** ఈనెల 23న జరగనున్న సాగునీ టి సంఘాల ఎన్నికలకు సంబంధించి సిబ్బందికి శిక్షణా కార్యక్రమం శనివారం ఉదయగిరి పట్టణంలోని స్త్రీ శక్తి భవన్లో జరిగింది. ఈ సందర్భంగా జల వనరుల శాఖ అధికారులు మాట్లాడుతూ 21న నామినేషన్ల స్వీకరణ, 22న పరిశీలన, 23న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు గాను ముందస్తుగా పోలింగ్ అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు ఎన్నికల నియమాలు సంబంధించిన విధివిధానాలపై శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ తోట శ్రీనివాసులు, ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి, జేఈ వేణు పాల్గొన్నారు.

## చిన్నారుల చేతివంటకాలు ఆహా ఏమి రుచి



**వింజమూరు,నవంబర్16ప్రభాతవార్త:** వింజమూరులోని ఇన్‌ఫాంట్ జీసెస్ ఇంగ్లీష్‌మీడియం స్కూల్ విద్యార్థులు బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థుల చిట్టిచేతులు చేసిన వంటకాలు ఆహా ఏమి రుచి అన్నట్లు గా ఉన్నాయి. పాఠశాల కరస్పాండెంట్ ఐజాక్ , ఉపాధ్యాయులు పాఠశాలలోని చిన్నారులతో పలు వంటకాలు చేయించారు. బాలల దినోత్సవంలో భాగంగా 14వ తేదీ నుండి వివిధ కార్యక్రమాలను తమ పాఠశాలలోని విద్యార్థులతో చేయించామని ఐజాక్ తెలిపారు. విద్యార్థులకు చిన్నతనంనుండే విద్యాబోధనతోపాటు ఇంటిపని, వంటపని నేర్పించాలనే ఉద్దేశంతో ఈకార్యక్రమాన్ని చేపట్టామన్నారు. విద్యార్థుల్లో ఎంతో నైపుణ్యం దాగిఉందని వారిని అన్ని విధాల ప్రోత్సహిస్తేవారు ఉన్నత శిఖ రాలను అందుకుంటారన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సహకారంతో కాలువ పూడికతీత చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా



**బుచ్చి నవంబర్ 16 ప్రభాతవార్త** కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డిప్రశాంతి రెడ్డి సహకారంతో కాలువల పూడికతీత పనులకు శ్రీకారం చుట్టినట్లు బుచ్చిరెడ్డిపాళెం నగరపాలక పంచాయితీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా తెలిపారు. పీర్ల కాలువ,కొత్త గుడిపల్లి కాలువ పూడికతీత పనులను ఆమె టెంకాయ కొట్టి ప్రారంబించారు. అనంతరం ఆమె మాట్లాడుతు బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలో టౌన్ ప్లానింగ్ నిధులతో కాలువల పూడికతీతకు శ్రీకారం చుట్టడం జరిగిందని ఆమె తెలిపారు.కొత్తగుడిపల్లి కాలువ,పీర్ల కాలువ పూడిక తీస్తే టౌన్‌లో ఆ కాలువలకు అనుసంధానంగా ఉన్న కాలువలలో నీరు ఆగకుండా వెళ్లిపోతుందని ఆమె తెలిపారు. కాలువల పూడిక తీతకు ఇది సరైన సమయం అని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.అనంతరం కమీషనర్ ఎల్. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతు టౌన్‌ప్లానింగ్ నిధులతో పలుకాలువలు మంజూరు అయివున్నాయని ఈ కాలువలన్ని పూడికతీస్తే గ్రామంలోని వీధులలో చుక్క నీరు నిలబడదని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా ఆయన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈకార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తాళ్ళ నరసింహస్వామి, చిరమణ సురేష్‌బాబు, ఇలియాజ్, మురళీ తదితరులున్నారు.

## వైభవంగా కార్తీక పూజలు



**కోవూరు, నవంబర్ 16 ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కామాక్షిసమేత మల్లికార్జున స్వామి దేవస్థానంలో శనివారం కార్తీక మాస పర్వదినం సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రధాన అర్చకులు సుబ్బరామయ్య ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళా భక్తులు ప్రత్యేకంగా పూజలు నిర్వహించుకుని ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైభవంగా పల్లకి సేవ



**కోవూరు, నవంబం16ప్రభాతవార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలోశనివారం కార్తీక మాస ఎర్వదినం సందర్భంగా ప్రాత:కాలమునే స్వామివారికి ఆలయ ప్రధాన అర్చ కులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. స్వామివారికి పల్లకి సేవ కార్యక్రమాలను కన్నులపండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, నవంబం16ప్రభాతవార్త :** తహసీల్దార్ కార్యాలయానికి ప్రతి సోమ వారం ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు సకాలంలో పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ నిర్మలా నంద బాబా అన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని అన్ని గ్రామాలకు సంబంధించిన గ్రామ రెవెన్యూ అధికారులు, తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్జీని నిశితంగా పరిశీలించి వాటికి తగు పరిష్కారం చూపేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం సాగునీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఈ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు 1432 ఫసలీ వరకు ఎటువంటి బకాయిలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామ రెవెన్యూ అధికారి వారి వారి పరిధిలో వాటర్ ట్యాంక్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా దృష్టి పెట్టాలన్నారు. అదేవిధంగా ప్రతి వీఆర్‌వో వారికి కేటాయించిన విధులు, బాధ్యతలను సక్రమంగా నిర్వహించి మండలానికి మంచిపేరు తేవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారి వారీగా వారి పనితీరుపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలోడిప్యూటీ తహసీల్దార్ ఎస్‌కే నాజర్,డిప్యూటీ తహసీల్దార్ రవి కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాకేష్, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, సర్వేయర్ రమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న విద్యుత్ దీపాలు

**లింగసముద్రం, నవంబర్ 16, ప్రభాతవార్త** మండలంలోని పెద్దపవని గ్రామంలో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి. రాత్రి సమ యాలలో వెలగాల్సి న వీధి దీపాలు పగలు పూ ట వెలుగుతుండటం పట్ల గ్రామస్తులు విమ ర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం గురించి విద్యుత్ శాఖ అధికారులకు పంచాయతీ సిబ్బందికి తెలియజేసినప్పటికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని చెబుతున్నారు. రాత్రి సమయంలో వీధి దీపాలు లేక ఇబ్బందులు పడుతున్న కాలనీలు చాలానే ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి పగలు పూట వెలుగుతున్న వీధిలైట్లను ఆపించేలా చర్యలు తీసుకుని రాత్రి సమయాల్లో వీధి లైట్లు లేని ప్రాంతంలో లైట్లు వెలిగించాలని పెద్దపవని గ్రామ స్తులు కోరుతున్నారు.





**పరిశీలించి చర్యలు తీసుకుంటాం:** కార్యదర్శి రషీద్ గ్రామంలో విద్యుత్ దీపాలు పగలు వెగులుతున్న విషయం పంచాయతీ కార్యదర్శి రషీద్‌ను ప్రభాతవార్త ప్రతినిధి ఫోన్లో సంప్రదించగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.

## చురకశ్రీ హయ్యూల్ హయ్యూమ్‌కు ఘనసత్కారం



**కావలిరూరల్, నవంబర్ 16 ప్రభాతవార్త** కావలి వెంగళరావున గంలోని శ్రీ పొట్టిశ్రీరాములు మున్సిపల్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రముఖ రచయిత, కవి, చురకశ్రీ సయ్యద్ హయ్యూల్ హయ్యూమ్ అక్టోబర్ 20వతేదీన హైదరాబాద్‌లోని శ్రీ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ప్రాంగణంనందు జరిగిన నాలుగురాష్ట్రాల కవిసమ్మేళనంలో పరిపూర్ణ మానవుడు మహమ్మద్ (స.అ.స) రచనలో ప్రతిభావంతులైన యాభైమందిలో చురకశ్రీ సయ్యద్ హయ్యూల్ హయ్యూం అత్యంత ప్రతిభ కనపర్చినందుకు ప్రత్యేకంగా అభినందిస్తూ ఆహ్వానం మేరకు వెళ్లలేకపోవడంతో సంస్థ ప్రత్యేకప్రతినిధి ద్వారా ప్రశంసాపత్రం, మెమెంటో పంపడం జరిగింది. ఈ సందర్భంగా శనివారం పాఠశాలనందు పాంశాల విద్యాకమిటి ఛైర్మన్ వై.కల్లయ్య ఆధ్వర్యంలో బోధనాసిబ్బంది సమక్షంలో కావలి 18వవార్డు టిడిపి ఇన్‌చార్జి శానం హరి, 23వవార్డు టిడిపి ఇన్‌చార్జి వర్ధినేని వెంకటేశ్వర్లునాయుడు, ప్రధాన కార్యదర్శి అంబటి కిషోర్, సాహిత్య మిత్రులు కలిసి ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో యన్‌సిసి అధికారి టి.కొండారెడ్డి, సీనియర్ ఉపాధ్యాయులు బి.శాంతకుమారి, బి.శర్వాణి, కెయస్.అంజాద్‌ఆలి, ఐ.శ్రీనివాసులు, షేక్.సాబిరాబేగం, ఎ.శ్రీలక్ష్మి, వై.రజని, కె.విజయలక్ష్మి, బి.సుమన, కె.యేసురత్నం, వి.శ్రీనివాసులు, షేక్.రఫి, యస్‌వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కల్లుగీత కార్మికులతో డిప్యూటి కమీషనర్ సమావేశం



**బుచ్చి నవంబర్ 16 ప్రభాతవార్త** ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటి కమీషనర్ టి.శ్రీనివాసరావు బుచ్చిరెడ్డిపాళెంలోని ఎక్త్సెజ్ కార్యాలయాన్ని పరిశీలించారు.ఈకార్యక్రమంలో ఆయన వెంట సి.ఐ కె.పి కిషోర్ కూడా ఉన్నారు.గీత కార్మికులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్బంగా కల్లుగీత కార్మికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొని వచ్చారు. పాతపద్దతిలో కల్లుగీత కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే ప్రభుత్వం ఎక్స్‌గ్రేషియా చెల్లించే విధానం అమలు చేయాలని వారు కోరారు. గీత కార్మికులు చెట్టు పెంచు కునేందుకు భూమిని కేటాయించాలని వారు కోరారు. కల్లు ఆరోగ్యానికి మంచిదని ప్రభుత్వం ప్రకటించాలని వారు కోరారు. రైతులు పొలాలలో కల్లుగీత చెట్లు నరకకుండా ప్రభుత్వం చట్టం తీసుకొని రావాలని వారు కోరారు.పలు సమస్యలపైన గీత కార్మికులు వినతి పత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో కల్లుగీత కార్మికులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## శృంగేరి పీఠాధిపతి ఆశీస్సులకు తరలిరండి : ఎమ్మెల్యే



**కావలి, నవంబర్ 16 ప్రభాతవార్త** కావలి నియోజకవర్గంలోని బోగోలు మండల కొండబిట్రగుంటలో వెలసిఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర మహాస్వామి ఆదివారం సాయంత్రం 4 గంటలకు విచ్చేస్తారని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. కొండబిట్రగుంటలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు పీఠాధిపతి శంకుస్థాపనలు చేస్తారని తెలిపారు. తెలుగుదేశం, బిజెపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున కుటుంబసమేతంగా సాంప్రదాయ దుస్తుల్లో (పంచ, చీర) కొండబిట్రగుంటకు తరలివచ్చి స్వామివారి ఆశీస్సులు పొందాలని ఎమ్మెల్యే దగుమాటి కోరారు.

## ప్రమాదాల నివారణకు నివారణ చర్యలు



**దుత్తలూరు,నవంబర్ 16,ప్రభాతవార్త :** జాతీయ రహదారులపై ప్రమా దాలు జరిగే చోట నివారణ చర్యలు తీసుకుంటామని కావలి ఆర్‌టిఓ కరుణాకర్ బాబు అన్నారు .శనివారం 565 వ జాతీయ రహదారి పై వరికుంటపాడు, దుత్తలూరు మండలాల పరిధిలోని బ్లాక్ స్పాట్ లను ఆయన పరిశీలిం చారు.ప్రమాదాల నివారణ కోసంప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు.జాతీయ రహదారిపై అత్యధికంగా ప్రమాదాలు రోడ్ల పై గేదేలు వస్తుం డడంతోనే జరుగు తున్నాయనీ గుర్తించారు.ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేసిన సీడీపీఓ శారద



**కందుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** మండలంలోని మాచవరం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం కందుకూరు సీడీపీఓ శారద ఆకస్మిక తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని చెప్పారు. ఆయా రికార్డులను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభావతి, శైలజ, ఆయాలు ఉన్నారు.

## ఉదయగిరిని అన్ని విధాల అభివృద్ధి చేయాలి



**వింజమూరు, నవంబర్16ప్ర భాత వార్త:** నెల్లూరు జిల్లాలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఉదయగిరి నియోజకవర్గమని , 40ఏళ్ళుగా అన్ని విధాల నిర్లక్ష్యానికి గురై వివక్షత చూపబడిన ప్రాంత అభివృద్ధికి ఉమ్మడి ప్రభుత్వంలో అన్ని విధాల అభివృద్ధి చేయాలని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ బడ్జెట్ సమావేశంలో అసెంబ్లీలో తన గళాన్ని వినిపించారు. ఇటీవల జరుగుతున్న ఎపి బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ప్రతి రోజు సమావేశాల్లో ఉదయగిరి నియోజకవర్గానికి అభివృద్ధి విషయంలో జరిగిన అన్యాయాన్ని సభదృష్టికి తెస్తున్నారు. విద్యావ్యవస్థ, ఇరిగేషన్, రోడ్లు-భవనాలు తదితర విషయాలను సభదృష్టికి తెచ్చారు. వింజమూరు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటు , ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పథకం సద్వినియోగం, సోమశిల ఉత్తర కాలువ సబ్ కెనాల్‌ను పూర్తిచేయాలని , వెలిగొండ ప్రాజెక్ట్ ను పూర్తిచేయాలని , గండిపాళెం రిజర్వాయర్ కు సిబ్బంది నియామకం, అనేక సమస్యలపై సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్ళారు. సంబంధిత మంత్రులు కాకర్ల అభ్యర్థనను పరిగణలోకి తీసుకొని నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తామన్నారు.

## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ లక్ష్యం.. జెడ్పిటిసి రావెళ్ల నాగేంద్ర




**వరికుంటపాడు, నవంబర్ 16,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యం అని జెడ్పిటిసి రావెళ్ల నాగేంద్ర అన్నారు.శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ శిక్షణలో భాగంగా 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ లో చేపట్టే పనుల,అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు.ఈ కార్యక్రమములో జెడ్పిటిసి రావెళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుందని,గ్రామాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు.అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధు లు, అధికారులతో పాటు ప్రజలు భాగస్వామ్యులు కావాలని కోరారు.ఈ కార్యక్రమములో ఈఓఆర్డి నాగూర్‌వలి,ఎంపిడిఓ కార్యాలయ సీనియర్,జూనియర్ సహాయకులు వెంకటాద్రి,రామకృష్ణారెడ్డి,సర్పంచ్‌లు కొండెపోగు దిలీప్‌కుమార్,అరవ మహేష్,ప్రభాకర్ రెడ్డి,నాగరాజు,ఎంఆర్సి డి.విరమణ,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు



**కందుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సబ్ జూనియర్ బాల బాలికల రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలను ప్రారంభించినట్లు జిల్లా కార్యదర్శి ఎస్‌కే అబ్దుల్ సలాం తెలియజేశారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా నుండి క్రీడాకారులు 300 కు మించి పాల్గొనడం జరిగింది.ఈ పోటీలను కందుకూరు డీఎస్పీ సీహెచ్‌వీ సుబ్రహ్మణ్యం, ప్రకాశం కాలేజీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, రాష్ట్ర తైక్వాండో కార్యదర్శి ఎల్‌టీ చంద్రమౌళి జిల్లా అధ్యక్షులు ఉన్నం వీరాస్వామి, అక్స్‌ఫర్డ్ విద్యా సంస్థల ఛైర్మన్ వున్నం భాస్కరరావు, ప్రముఖ వ్యాపార వేత్త గోనుగుంట వెంకటేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పోటీలలో బంగారు పతకం సాధించిన క్రీడాకారులు ఈనెల 28 నుండి డిసెంబర్ 2వరకు హర్యానాలో జరగబోవు జాతీయ స్థాయి తైక్వాండో పోటీలలో పాల్గొంటారని తెలియజేశారు.ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా తమిళనాడు రాష్ట్రం నుండి రెఫరీలను పిలిపించడం జరిగింది.

## ప్రభుత్వ వైద్యశాలను ప్రక్షాళన చేయండి

### - పేద ప్రజలను జ్వరాల భారి నుండి రక్షించండి



**ఉలవపాడు ,నవంబర్ 16, ప్రభాతవార్త** ఉలవపాడు మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఏరియా వైద్యశాల పేరుకు మాత్రమే ప్రభుత్వ వైద్యశాల పేద ప్రజలకు ఏ మాత్రం ఉపయోగపటడం లేదని ఉలవపాడు మండల కేంద్రంలోని ప్రజలు చర్చించుకుంటున్నారు. వర్షాలు కురిసి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాలు విజృంభించి ప్రజలంతా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ప్రైవేటు ఆసుపత్రులకు, ఆర్‌ఎంపీలు దగ్గరికి వెళ్లి వేలకి వేల రూపాయలు ఖర్చు పెట్టి అప్పులు పాలవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు, ప్రభుత్వాధికారులకు ఉన్నతాధికారులు ఉలవపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు కల్పించి, ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేసి ప్రజలకు సకాలంలో వైద్యం అందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలనే సామాజిక బాధ్యత కొరవడింది. ఉలవపాడు మండలంలో 12 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలోని కరేడు పంచాయతీ, చాకిచర్ల పంచాయతీలలో ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్న నామమాత్రంగానే వైద్య సేవలు అందిస్తున్నాయి. అందువలన ప్రజలు కావలి, ఒంగోలు, కందుకూరు ప్రాంతాల్లోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. ఉలవపాడు మండల కేంద్రంలో గల ఏరియా సామాజిక వైద్యశాల నందు గైనకాలజిస్టు డాక్టర్లు లేరు. జనరల్ సర్జన్ కూడా లేరు, వచ్చిన డాక్టర్లను ఉలవపాడులోని కొంత మంది అసాంఘిక శక్తులు బ్లాక్ మెయిల్ చేస్తుండటంతో వచ్చిన కొద్ది కాలంలోనే తిరిగి వేరే ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. డెంటల్ డాక్టర్ మాత్రం పోస్టింగ్ ఇక్కడే ఉన్న ఆయన వేరే ప్రాంతంలో వైద్య సేవలు అందిస్తున్నారు. జీతం మాత్రం ఉలవపాడు ప్రభుత్వ వైద్యశాల నుండి పొందుతున్నారు. గైనకాలజిస్టు డాక్టర్లు లేకపోవడం, జనరల్ సర్జన్ లేకపోవడంతో ఉలవపాడు చుట్టు పక్కల గ్రామాల నుండి వచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ పేదలు ఇతర ప్రాంతాలకు లేదా ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి అప్పులు పాలు అవుతున్నారు. కనీసం రక్త పరీక్షలు చేసేందుకుల్యాబ్ టెక్నీషియన్ కూడా లేకపోడం అత్యంత బాధాకరమైనటువంటి విషాదకరమైన విషయం. ఉలవపాడు మండలంలో 32 గిరిజన కాలనీలు ఉన్నాయి. ఈ గిరిజన కాలనీలోని ఉండే ప్రజలు శివారు ప్రాంతాల్లో ఉండి నిత్యం అనారోగ్యానికి గురవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలన్నీ వర్షాలు కురిస్తే నీట మునిగిపోవడంతో ఆసుపత్రికి వచ్చే రోగులు దోమలతో యుద్ధం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరో వైపు రాత్రి పూట డ్యూటీ డాక్టర్ లేకపోవడంతో అనారోగ్యానికి గురైన ప్రజలు ఆసుపత్రికి వెళ్తే పట్టించుకునే నాథుడే లేకపోవడంతో నరకాన్ని అనుభవిస్తున్నారు. అయినా ప్రజాప్రతినిధులు కాని, ప్రభుత్వ అధికార యంత్రాంగం కానీ పట్టించుకోవడం లేదు. అందువలన ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి ఉలవపాడు ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్లను నియమించి ల్యాబ్ టెక్నీషియన్ నియమించి రాత్రి పూట డ్యూటీ డాక్టర్ పని చేసేలా చర్యలు తీసుకుని ప్రజలను అనారోగ్యాల భారి నుండి కాపాడతారని ఉలవపాడు మండలంలోని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## షాపుల ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



**ఉలవపాడు, నవంబర్ 16, ప్రభాతవార్త** మండల కేంద్రమైన ఉలవపాడు పోలీ సు స్టేషన్‌లో ఎస్సై కే.అంకమ్మ బంగారం షాపు యజమా నులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ బంగారం షాపు యజమానులు షాపులు ముందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు దోహదపడతాయన్నారు. సదరు సీసీ కెమెరాలతో చుట్టు పక్కల పరిసర ప్రాంతాలు కవర్ అయ్యేలా చూసుకోవాలని, అంతే కాక షాపులకు అలారం లాకులు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. షాపుల వద్ద అనుమానిత వ్యక్తులు కనపడితే ముందుగా పోలీసు స్టేషన్‌లో తెలియజేయాలని సూచించారు.

## రామ్మూర్తి మృతికి సంతాపం తెలిపిన రవిచంద్ర

**నెల్లూరు, నవంబర్ 16, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు మృతికి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర శనివారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. నారా రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణం తెలుగుదేశం పార్టీకి వ్యక్తిగతంగా మాకు తీరని లోటన్నారు. చంద్రగిరి శాసన సభ్యులుగా నియోజకవర్గ అభివృద్ధికి అవిశ్రాంతంగా శ్రమించిన నేత నారా రామ్మూర్తి నాయుడని, పారిశ్రామిక రంగంలో సైతం నారా రామ్మూర్తి రాణించి, విశిష్ట సేవలను అందించాడన్నారు. తన వ్యక్తిత్వం, మంచితనంతో అందరి ఆదరాభిమానాలను నారా రామ్మూర్తి నాయుడు పొందారని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నానని రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రెడ్ క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రికి రూ.5లక్షలు విరాళం



**నెల్లూరు, నవంబర్ 16, ప్రభాతవార్త-వైద్యం** నెల్లూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న ఇండియన్ రెడ్ క్రాస్ క్యాన్సర్ హాస్పిటల్‌కి, శనివారం సత్యాస్ బ్లూ థింకింగ్ ఈక్విటబుల్ సొసైటీ ట్రస్టు ఛైర్‌పర్సన్ యాచమనేని బృంద,పాకాల శ్రీవల్లి, పాకాల శ్రీకాంత్, చేడిమాలఉమారాణి, చేడిమాల విజయకుమార్‌లు రూ.5లక్షల చెక్‌ను రేడియో థెరపీ బ్లాక్ అభివృద్ధి కోసం విరాళంగా క్యాన్సర్ హాస్పిటల్ జనరల్ మేనేజర్ ఐ.భక్తవత్సల రెడ్డి, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.నాగేశ్వరావులకి అందజేశారు. రెడ్ క్రాస్ కోశాధికారి సురేష్ కుమార్ జైన్, మేనేజింగ్ కమిటీ సభ్యులు వాకటి విజయ్ కుమార్‌రెడ్డి, యాలమూరి రంగయ్య నాయుడు, క్యాన్సర్ హాస్పిటల్ దోనర్స్ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## ఊర్జవీర్‌లో ప్రజలందరూ భాగస్వాములు కండి



**నెల్లూరు, నవంబర్ 16, ప్రభాతవార్త-వైద్యం** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఊర్జవీర్ పథకంలో ప్రజలు భాగస్వామ్యం కావాలని, ప్రైవేటు ఎలక్ట్రిషన్లు సైతం రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీరు వి.విజయన్ కోరారు. శనివారం నగరంలోని విద్యుత్ భవన్‌లో విజయన్ విలేకర్లతో మాట్లాడుతూ అతి త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభిస్తారని తెలిపారు. ఊర్జ వీర్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం చాలా సులభతరం అని మొదటగా ఊర్జ వీర్ వెబ్ పేజీలోకి వెళ్లి ఈఈఎస్‌ఎల్ మార్ట్ డాట్‌ఇన్/ఊర్జవీర్‌లోకి వెళ్లి రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయాలని తెలిపారు. రిజిస్ట్రేషన్‌పై క్లిక్ చేయగానే మీ పేరు, మీ ఈ మెయిల్, మీ అడ్రస్, ఫోన్ నెంబర్ ఇచ్చి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. తర్వాత మీకు మెయిల్ వస్తుందని, తర్వాత కేవైసీ పూర్తి చేసుకుని అనగా ఆధార్ కార్డు, పాన్ కార్డు, బ్యాంకు అకౌంట్ డీటెయిల్స్ పూర్తవగానే మీకు ఒక లాగిన్ వస్తుందని, మీరు ఈ లాగిన్‌లో లాగిన్ కావాలని తెలియజేశారు. ఈ రిజిస్ట్రేషన్ ఖర్చు రూ.21లు మీరు మీ బ్యాంకు ఖాతా నుంచి చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. మీరు మీ బ్యాంకు ఖాతా నుంచి రూ.21 చెల్లించిన తర్వాత మీ అకౌంట్ యాక్టివ్ అయినట్లు మీకు మెయిల్ వస్తుందని అన్నారు. తర్వాత మీకు ఈఈఎస్‌ఎల్ వారు వారి సర్టిఫికేట్ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఏపీ ఎనర్జీ ఎఫిషియన్సీ డవలప్‌మెంట్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్ సంయుక్తంగా ఈ ఊర్జ వీర్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని తెలిపారు. వినియోగదారులు విద్యుత్ బిల్లులో 15 నుంచి 25 శాతం ఆదా చేసేలా ఇంధన సామర్థ్య ఎల్‌ఈడీ బల్బులు, ట్యూబ్ లైట్‌లు, బీఎల్‌డీసీ సీలింగ్ ఫ్యాన్లు, 1.5 టన్ను సామర్థ్యం ఉన్న ఏసీలు, కుకింగ్ స్టౌలు, ఎల్‌ఈడీ ఇన్వర్టర్ బల్బులను ఈఈ ఎస్‌ఎల్ మార్ట్ ఇన్ పోర్టల్ ద్వారా విక్రయించేందుకు ఊర్జవీర్ సేవలను ఈఈఎస్‌ఎల్ వినియోగించనుంది. ఈ విక్రయాలపై ప్రతి నెల నిర్దేశిత మొత్తాన్ని కమీన్ రూపేనా చెల్లిస్తుందని ఆయన వెల్లడించారు. ఈఈఎస్‌ఎల్ స్టార్ రేటెడ్ పరికరాలను రిజిస్టర్డ్ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ ప్రమోట్ చేయాలనేదే లక్ష్యమని తెలిపారు. వీరు ప్రమోట్ చేసినందుకు ప్రతి నెల వీరికి ఒక్కొక్క పరికరానికి నిర్ధేశించిన మొత్తాన్ని వీరి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో విద్యుత్ శక్తిని ఆదా చేసి భావితరాలకు అందించే ప్రయత్నంలో భాగమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఒక యూనిట్ విద్యుత్‌ను ఆదా చేస్తే రెండు యూనిట్ల ఉత్పత్తి చేయడమే కాబట్టి ప్రతి ఒక్కరూ ఊర్జ వీర్ పథకాన్ని వినియోగించుకోవాలని కోరారు.

## రెండో రోజు పట్టణంలో ఎరువుల దుకాణాల తనిఖీ



**కందుకూరు, నవంబర్ 16, ప్రభాతవార్త** కందుకూరు పట్టణం పరిధిలోని విత్తన, ఎరువులు, పురుగు మందుల షాపులను మండల వ్యవసాయాధికారి వి.రాము ఆధ్వర్యంలో శనివారం కావలి సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) డాక్టర్ సీహెచ్ నాగరాజు తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. పట్టణంలో ఓ దుకాణంలో ఈ పాస్ మిషన్‌లోని నిల్వలు, రిజిస్టర్‌లోని నిల్వలు సరిపోలేదని ఎరువుల యజమానికి తెలియజేసి రూ.3,02,744పై విలువైన యూరియా 5.95 మెట్రిక్ టన్నులు, 20:20:0:13 8.700 మెట్రిక్ టన్నులు, 13:0:45(60కేజీ), 19:19:19(60కేజీ) తాత్కాలికంగా అమ్మకాలను నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. నాగరాజు మాట్లాడుతూ ప్రైవేటు డీలర్లు అందరూ షాపుల ముందు డీలర్ షాపు పేరు, లైసెన్సు నెంబరు, అడ్రస్ బోర్డు చూపించాలని తప్పనిసరిగా మీ యొక్క లైసెన్సులో ఎరువులను సరఫరా చేసే కంపెనీల ఉత్పత్తులను ఫారం(ఓ) ద్వారా పొందుపరచాలని, ఎరువులు ఎంఆర్‌పీ ధరకు మాత్రమే విక్రయించాలని, రైతుకు రసీదు ఇవ్వాలని, నోటీసుబోర్డులో అమ్మకపు ధరలు, ఎరువుల నిల్వ చూపించాలని, బిల్ బుక్‌లో రైతు సంతకం, డీలర్లు సంతకం ఉండాలని, పాస్ పుస్తకంలో రైతు విస్తీర్ణం బట్టి బయోమెట్రిక్ ఆధారంగా వేలిముద్ర వేసుకుని ఎరువులను పంపిణీ చేయాలని తెలిజేశారు. లేనిచో అట్టి వారిపై ఎరువుల చట్ట-1985 ప్రకారం తగు చర్యలు తీసుకుం టామని హెచ్చరించారు. తదుపరి ఎలక్ట్రానిక్ మిషన్ ద్వారా నిల్వ ఉన్న ఎరువులు, భౌతికంగా నిల్వ ఉన్న ఎరువులను పరిశీలించారు. తదుపరి ఎరువుల బస్తాలను నికర తూకం సరిగా ఉందో లేదో అని పరిశీలించి రైతులకు వివరించారు. పైన తెలియజేసిన వివరాల ప్రకారం రైతులు గమనించి వ్రాత పూర్వకంగా మీ మండల వ్యవసాయాధికారికి ఫిర్యాదు చేసి, తగు సూచనలు, సలహాలు పొందవచ్చని తెలియజేశారు.

## రామ్మూర్తి మరణం బాధాకరం

**నెల్లూరు, నవంబర్ 16, ప్రభాతవార్త-వైద్యం** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోదరుడు, నారా రామ్మూర్తి నాయుడు మరణం బాధాకరమని తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సర్వేపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 1994 నుండి 1999 వరకు చంద్రగిరి ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఆయనతో నేను సర్వేపల్లి శాసనసభ్యునిగా కలిసి పని చేసిన అనుభవం గుర్తుకు వస్తోందన్నారు. ఆయన మన మధ్య లేకపోవడం వ్యక్తిగతంగానే నాకు బాధ కలిగించిందని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఈ కష్టసమయంలో ధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్ధిస్తున్నానని సోమిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎస్పీతో భేటీ అయిన ఎస్టీ కమిషన్ సభ్యుడు



**నెల్లూరు క్రైమ్, నవంబర్ 16, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమీషన్ సభ్యులు వడిత్య శంకర్ నాయక్ శనివారం జిల్లా ఎస్పీ జి.కృష్ణ కాంత్‌తో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు.శని వారం జిల్లాకువిచ్చేసిన ఆయన జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసిపుష్పగుచ్ఛం అందజేశారు.